# ఇస్లాం ప్రియ బోధనలు

# ISLAM PRIYA BODHANALU


రచయిత

సయ్యద్ అబ్దుల్ హకీం, ఎం.ఏ.

**SYED ABDUL HAKEEM** M.A.

అనువాదం

అబ్దుల్ బాసిత్ ఉమరీ, ఎం.ఓ.ఎల్.

**ABDUL BASITH OOMERY** , M.O.L.



ప్రచురణ కర్త

ఉమ్మెముహమ్మద్

దోహాఖతర్

ఇస్లాం ప్రియ బోధనలు

ముద్రణ : ద్వితీయ
హక్కులు : రచయితవి
ప్రతులు : 1000
క్రీ.శ. 1994 అక్టోబర్
హి.శ. 1415, జుమాదల్ఊలా

వెల : ఉచితం

టైప్‌సెట్టింగ్ :
మోహన్ ఎంటర్ ప్రైజెస్
నారాయణగూడ, హైదరాబాదు-29

ముద్రణ :

దోహఖతర్ వాస్తవ్యురాలైన పుణ్యవనిత
ఉమ్మె ముహమ్మద్ తన స్వయం పుణ్యార్థం
ఈ పుస్తకాన్ని తెలుగులో ప్రచురించి
పాఠకులకు ఉచితంగా పంచి పెట్టమని
కోరినారు.

అల్లాహ్ ఆమె సత్కార్యాలను స్వీకరించు గాక!

ఆమీన్

بسم الله الرحمن الرحيم

# తొలిపలుకు

ఈ లోకం ఆర్థికంగా , భౌతికంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ, మానవతా విలువలు దిగజారుతున్నాయి. అందుకనే ఈ లోకంలో శాంతి సౌభాగ్యాలు కరువై దౌర్జన్యకాండలు, రక్తపాతాలు పెచ్చరిల్లిపోతున్నాయి. నేడు మనశ్శాంతి కోసం అల్లాడుతున్న మానవజాతికి ఇస్లాం ధర్మంలోనే ఆశాకిరణం కానవస్తుంది ఇస్లాం ధర్మం శాంతి సౌభాగ్య బోధనలతో నిండిఉంది. సత్ప్రవర్తన, నీతి, న్యాయం, సత్యసంధత, ప్రేమ, సోదరభావం, శాంతి ; ఇవన్నీ ఇస్లాం బోధనలకు ప్రతిరూపాలే సర్వమానవాళిని సృజించిన అల్లాహ్‌కు మానవాళి కృతార్థమార్గం తెలియును. కావున వారి కృతార్థతకొరకు ఆయన ఇస్లాం ధర్మాన్ని అవతరింపజేసెను.

పరలోకమునందు, విచారణదినమునందు విశ్వాసం ఉంచటం ఇస్లాం మౌలిక బోధనల్లో ఒకటి. అందువల్లనే మానవుడు దుష్ఫలితాలకు. నరకశిక్షకు బయపడి, సత్ఫలితాలను, స్వర్గ భాగ్యాలను ఆశిస్తూ దుష్కార్యాలకు దూరంగా ఉంటూ, సత్కార్యాలు చేస్తూ ఉంటాడు. ఇందువల్ల ఈ లోకం శాంతి సౌభాగ్యాలకు అలవాలమవుతుంది. కానీ పరలోక విశ్వాసమే లేకపోతే ఈ లోకం దౌనర్జన్యకాండలకు రక్తపాతాలకు ఆలవాలమై నరకకూపంలా తయారవుతుంది.

ఏక దైవారాధన విశ్వాసం , దైవప్రవక్త విశ్వాసం, పరలోక విశ్వాసం ఇవి మూడూ ఇస్లాం ధర్మం యొక్క మౌలిక బోధనలు.

కానీ ఈ మూడు బోధనలయందు విశ్వాసం ఉంచు ముస్లింలే వాటిని సరిగా అర్థం చేసుకోక వాటిగురించిన విధులు నెరవేర్చ లేకపోతున్నారు. కావున ముస్లింలు ఇస్లాం ధర్మాన్ని సంపూర్ణంగా అర్థంచేసుకుని దాని ప్రకారం ఆచరించటం కోసమే ఈ పుస్తకం రచయింపబడింది. ఈ విధంగా ముస్లింలు వాస్తవంగా ముస్లింలై ముస్లిమేతరులకు మార్గదర్శులు కాగలరు.

కానీ ఒక చేదు వాస్తవమేమిటంటే కొందరు ముస్లింలు తమ అజ్ఞానము వల్ల ముస్లిమేతరులకు తీసిపోని విధంగా తయారయ్యారు. తాము ముస్లింలని చెప్పుకుంటూనే అల్లాహ్‌ను విడిచి సమాధులను, వలీలను పూజిస్తున్నారు. లాభనష్టాలు, సుఖదుఃఖాలు వారి చేతిలోనే ఉన్నాయని భావిస్తున్నారు. దైవప్రవక్తముహమ్మద్ మానవుడు కాదని, దేవుని భాగం లేదా అవతారమని అపార్థపడుతున్నారు. జంతువులను అల్లాహ్ పేరకాకా సమాధుల పేర బలియిస్తున్నారు. నమాజ్ ఆరాధనను అల్లాహ్ కొరకు అంకితం చేయక అబ్దుల్ ఖాదిర్ జీలానీ కొరకు కూడా భాగం ఇస్తున్నారు. సమాధులకు ప్రదిక్షిణాలు చేసి హజ్ చేసినంత పుణ్యం దొరికిందని, ఇక స్వర్గప్రవేశం తప్పక లభిస్తుందని సంబరపడుతున్నారు. ఇవన్నీ నామమాత్రపు ముస్లింలు యేర్పరుచుకున్న బూటకపు దురాచారాలేగానీ, వాటికి ఇస్లాంతో ఎటువంటి సంబంధమూ లేదు. అందుకనే ముస్లింలు సంఖ్యలో అధికంగా ఉన్నా, వారికి యే విధమైన విలువా లేకపోయింది. అజ్ఞానం మరియు ఇస్లాం వాస్తవ బోధనలకు దూరం కావటం వల్లనే ఇలా జరుగుతోంది.

ఇకనైనా ముస్లింలు సువర్ణావకాశాలను చేజార్చుకోకుండా ఇస్లాం వాస్తవ బోధనలు తెలుసుకుని వాటి ప్రకారం ఆచరించి అల్లాహ్‌ను సంతుష్టపర్చియు ఆయన దయకు పాత్రుల కాగలరని

ఆశిస్తున్నాం. మౌలానా సయ్యద్ అబ్దుల్ హకీంగారు ముస్లింల సంస్కరణ మరియు ముస్లిమేతరులకు ఇస్లాం ధర్మ ఆహ్వానం మొదలగు ఉన్నత సంకల్పాలతో ఈ పుస్తకాన్ని రచించి ధన్యులయ్యారు. ఇందు అన్ని విషయాలూ దివ్యఖుర్ ఆన్ వాక్యాలు మరియు పవిత్ర హదీసు వచనాల ఆధారంతోనే పేర్కొనబడినవి. ఈ క్రింద అతిక్లుప్తంగా రచయిత జీవిత విశేషాలు ఇవ్వబడుతున్నాయి.

సయ్యద్ అబ్దుల్ హకీంగారు 7-6-1939న హైదరాబాదులో జన్మించారు. ఆయన 1969 లో ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి ఎం.ఏ చేశారు. మరొక వైపు ఇస్లాం ధార్మిక విద్యలో కూడా ప్రావీణ్యత సంపాదించారు. ఆయన గొప్ప ప్రసంగీకులేకాక ప్రముఖరచయిత కూడా. ఇంతవరకు సుమారు ఇరవై చిరు పుస్తకాలు రచించారు. అవి ఉర్దూభాషలోనేకాక ఆంగ్లం మరియు తెలుగు భాషల్లో కూడా అనువదింపబడి ప్రచురింపబడినవి. మౌలానా సయ్యద్ అబ్దుల్ హకీంగారు ప్రస్తుతం సౌదీ అరేబియా ప్రభుత్వం తరుఫున దొహఖతర్ లో ఇస్లాం ప్రచార బోధనాకేంద్రంలో ధార్మిక బోధకునిగా సేవచేయుచున్నారు.

అల్లాహ్ రచయితకు, అనువాదకునికీ, ప్రచురణకర్తకు మరియు ఇతర సహకారులందరికీ సంకల్ప శుద్ధి ప్రసాదించుగాక! ఈ చిరు ప్రయత్నాన్ని స్వీకరించి మనందరికీ ఇహపరలోకాల కృతార్థత ప్రసాదించుగాక! ఆమీన్........

సయ్యద్ నఈముర్రహ్మాన్ ఎం. ఏ.

ప్రధాన కార్యదర్శి - జమ్ఇయ్యతె అహ్లెహదీస్;

హైదరాబాద్ - సికింద్రాబాద్.

# బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

పవిత్ర వచనం : లాఇలాహ ఇల్లల్లాహు ముహమ్మ దుర్రసూలుల్లాహ్. అనగా అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యులెవరూ లేరు. ముహమ్మద్ (స్వల్లల్లాహు అలైహివసల్లం) అల్లాహ్ యొక్క ప్రవక్త.

ఈ రెండు వాక్యాలను కలిపి పవిత్ర వచనం అంటారు. ఈ వచనాన్ని పఠించి, దాని అర్థం తెలుసుకొని, దానిని అంగీకరించి, దానియందు విశ్వాసం ఉంచి, దాని ప్రకారం ఆచరిస్తానని వాగ్దానం చేసిన తర్వాతనే యెవరైనాసరే ముస్లిం అవుతాడు. దాని అర్థం యేమిటంటే అల్లాహ్ ఒక్కడే నిజమైన దేవుడు. ఆయన తప్ప వేరే యెవరికి దేవుడు అనబడే అర్హతలేదు. అల్లాహ్ తప్ప పూజింపబడు వేరే అన్నీ బూటకపు దేవుళ్ళే కానీ నిజమైనవి కాదు. వాటిని ఆరాధ్యులుగా భావించటం వ్యర్థం.

దాని రెండవ భాగం యొక్క అర్థం యేమిటంటే ముహమ్మద్ అల్లాహ్‌యొక్క సత్యప్రవక్త. ఇందు యెటువంటి సందేహము లేదు. ఆయన యందు విశ్వాసం ఉంచి ఆయనను అనుసరించటం ద్వారానే మానవ జాతికి మోక్షం లభించును.

పైన పేర్కొనబడిన పవిత్ర వచనమునందు విశ్వాసం ఉంచుటకై యేడు నిబంధనలు కలవు. అవి. 1. జ్ఞానం 2. సంపూర్ణ నమ్మకం 3. చిత్తశుద్ధి 4. సత్యసంధత 5. స్వీకారం 6. విధేయత 7. ప్రేమ

1. జ్ఞానం : పవిత్ర వచనాన్ని పఠించు ప్రతి వ్యక్తీత్వ ఆ వచనం యొక్క అర్థాన్ని తప్పక తెలుసుకోవాలి. అనగా అల్లాహ్ తప్ప వేరేయెవరూ ఆరాధనకర్తులు కాజాలరని, అల్లాహ్ ఒక్కడే సత్యదేవుడని; మరియు ముహమ్మద్ అల్లాహ్ యొక్క సత్య ప్రవక్తయని తెలుసుకోవాలి.

2. సంపూర్ణ నమ్మకం : అల్లాహ్ ఒక్కడే దేవుడను యదార్థాన్ని సంపూర్ణంగా నమ్మాలి. దాని గురించి యెటువంటి సందేహమూ ఉండకూడదు.

3. చిత్త శుద్ధి : పవిత్ర వచనం ప్రకారం ఆచరిస్తూ ఒక అల్లాహ్‌నే చిత్తశుద్ధితో ఆచరించాలి. బహుదైవారధనకు రవ్వంతైనా అవకాశమివ్వరాదు. మనందరి ఆరాధనలు స్వచ్ఛంగా అల్లాహ్ కొరకే అంకితం కావాలి.

4. సత్య సంధత : పవిత్ర వచనం అతి సత్య వచనమని స్వచ్ఛమైన మనసుతో విశ్వసిస్తూ కపట మనస్తత్వానికి అతి దూరంగా ఉండాలి.

5. స్వీకారం : పవిత్ర వచనాన్ని నిస్సంకోచంగా స్వీకరించి అంగీకరించాలి. కొందరు పవిత్ర వచనాన్ని నోటితో ఉచ్ఛరిస్తూ అర్థం కూడా తెలుసుకుంటారు. కానీ గర్వాహంకారాలు మరియు ఈర్ష్యాద్వేషాల వలన ఆ వచనాన్ని అంగీకరించరు.

6. విధేయత : పవిత్ర వచనాన్ని అంగీకరించిన తర్వాత అల్లాహ్ అదేశాలకు పూర్తిగా విధేయులు కావాలి. అదియెలా అనగా అల్లాహ్ అదేశాల ప్రకారం ఆచరిస్తూ, ఆయన నిషేధించిన వాటికి అతి దూరంగా ఉండాలి. ఇస్లాం

యదార్థంయేమిటంటే మానవుడు తన తనువూ మనసుల ద్వారా అల్లాహ్ పట్ల విధేయత చూపాలి. ఏక దైవారాధన మరియు దైవ ప్రవక్త గారి అనుసరణ ద్వారా అల్లాహ్‌ను సంతుష్ట పర్చాలి.

7. ప్రేమ : పవిత్ర వచనం యందు విశ్వాసం ఉంచటమేకాక దాని పట్ల ప్రేమ కూడా కలిగి ఉండాలి. ఎందుకంటే అల్లాహ్‌ను ప్రేమించువాడు అల్లాహ్ ధర్మమైన ఇస్లాంను తప్పక ప్రేమిస్తాడు. అల్లాహ్ పట్ల ప్రేమ లేనివాడు అల్లాహ్ ధర్మాన్ని కూడా ప్రేమింపజాలడు.

విధ్యాభ్యాస ప్రాముఖ్యత : దివ్యఖుర్ఆన్‌లో మొట్టమొదట అవతరింపబడిన వాక్యంలో విధ్యనభ్యసించమని ఆదేశింపబడింది. మన శ్రవణ, దృశ్య, ఆలోచనా శక్తు లు వాటిని వినియోగించుకుని ప్రయోజనం పొందటానికే మనకు ప్రసాదింపబడినవి. అల్లాహ్ యొక్క దైవత్వాన్ని తెలుసుకోవాలనే సంకల్పంతోనే ప్రతి వ్యక్తీ విద్యాభ్యాసం చేయాలి. అల్లాహ్ యొక్క అద్వితీయత, ఆయన ఉత్తమ గుణ విశేషణాలు మరియు కార్యాల గురించి తెలుసుకోవాలి. మానవుడు తనమేధాశక్తిని, ఆలోచనా ధోరణిని దైవవాణికి అనుగుణంగా మలచుకుంటే అతని జ్ఞానానికి మరియు జీవితానికి సార్థకత ప్రాప్తమవుతుంది.

మరొక ముఖ్య విషయమేమిటంటే అల్లాహ్‌కు నచ్చిన మరియు ప్రియమైన విషయాలు యేమిటో, ఆయనకు నచ్చని మరియు అసహ్యకర విషయాలు యేమిటో తెలుసుకుని, ఆయనకు నచ్చిన విషయాలను స్వీకరించి, ఆయనకు నచ్చని వాటికి అతి దూరంగా ఉండాలి. ఆయనకు నచ్చిన విషయాలు ఉదా : ధర్మవిశ్వాసం, ఏక దైవారాధన, దైవ ప్రవక్త అనుసరణ,

సత్య సంధత, ధార్మిక స్థిరత్వం మొదలగునవి. ఆయనకు నచ్చని విషయాలు ఉదా : బహుదైవారాధన, ధర్మ తిరస్కారం, కపట మనస్తత్వం, ధర్మభ్రష్టత, కల్పిత దురాచారాలు, దుష్కార్యాలు.

ఇక జ్ఞానం గురించి తెలుసుకుందాం. జ్ఞానం రెండు రకాలు.

1. సత్యజ్ఞానం (వుపయోగకర జ్ఞానం) 2. దుష్టజ్ఞానం (నిరుపయోగకర ప్రమాదకర జ్ఞానం)

సత్య జ్ఞానం వల్ల ఏకదైవారాధన, దైవప్రవక్త అనుసరణ, ధర్మ విశ్వాసం, సత్యసంధత, ధార్మిక స్థిరత్వం సదాచారాలు సత్కార్యాలు మొదలగు సత్ఫలితాలు లభిస్తాయి.

దుష్టజ్ఞానంవల్ల బహుదైవారాధన, ధర్మతిరస్కారం, కపటమనస్తత్వం, ధర్మభ్రష్టత, కల్పిత దురాచారాలు, దుష్కార్యాలు పాపకార్యాలు మొదలగు దుష్ఫలితాలు లభిస్తాయి.

సత్యజ్ఞానం పొందినవ్యక్తి సన్మార్గచారియై సత్కార్యాలు చేస్తే అల్లాహ్‌ను సంతుష్టపరుస్తూ, ఆయనకు నచ్చని వాటికి అతిదూరంగా ఉంటాడు. సర్వ విద్యలు మరియు జ్ఞానములకు అసలు పునాది దైవభక్తి. అనగా యే విద్యవల్లనైతే మానవుడు దైవభక్తి కలిగి, దేవుని ప్రేమించి, దేవుని సంతుష్టపర్చగల్గునో ఆ విద్యయే అసలు సత్యజ్ఞానం.

సత్య దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్‌ను ఈ విధంగా ప్రార్థించేవారు : "ఓ అల్లాహ్! ఉపయోగకారియగు జ్ఞానం నాకు ప్రసాదించుము, నీవు నాకు ప్రసాదించిన జ్ఞానమును నా కొరకు ఉపయోగకారిగా జేయుము. మరియు నా జ్ఞానమును అభివృద్ధిపర్చుము. "

ఆయనను ఈ విధంగా కూడా ప్రార్థించేవారు :
" ఓ అల్లాహ్ ! నాకు ఉపయోగకారియగు విద్య ప్రసాదించుము, మరియు నిరుపయోగకారియగు విద్య నుండి నన్ను దూరముగా ఉంచమని నిన్ను వేడుకొనుచున్నాను. "

**(నసాయీ, ఇబ్నె మాజహ్)**

జ్ఞానం వల్ల మానవునికి సంతృప్తి లభిస్తుంది. జ్ఞానవంతుడు తనకు మించిన వాని పట్ల ఈర్ష్య చెందడు. తనకంటే తక్కువ స్థానంలో ఉన్నవారిని హేళన చేయడు. జ్ఞానాభివృద్ధితో పాటు దైవభక్తి కూడా అభివృద్ధి చెందుతుంది. అంతేకాక అతనియందు వినయవిధేయతలు కూడా పెరుగుతాయి. అతను దేవుని కొరకే జీవిస్తాడు గానీ ధనధాన్యాల కోసం కాదు. దేవుని కొరకే తన ప్రాణం అర్పిస్తాడు గానీ భయ విచారాలకు తన ప్రాణంవృథా చేయడు.

దైవ ప్రవక్త ముహమ్మద్ ఒక ప్రవచనంలో ఇలా తెలిపారు. దేవుడైన అల్లాహ్‌ను మరువకుము. ఆయన నిన్ను తప్పక రక్షించును అల్లాహ్‌ను స్మరిస్తూ ఆయన అదేశాల ప్రకారం ఆచరించుము అపుడు అల్లాహ్ నీ యెదుట నీకు సమీపంగా ఉండునట్లు కనుగొంటావు. సుఖస్థితిలో అల్లాహ్‌ను మరువకుము. ఆయన నీదుఃఖ స్థితిలో నిన్ను మరువక నీకు సుఖస్థితి ప్రసాదించును.

# ఏకదైవారాధన–మానవ ప్రవర్తనా సంస్కరణ

ఏక దైవారాధన మానవ ప్రవర్తనను యే విధంగా సంస్కరించునో తెలుసుకునేముందు కొన్ని ముఖ్య విషయాలు తెలుసుకుందాం. భౌతికవాదం మరియు నాస్తికతను ఆంగీకరించిన వ్యక్తి జీవితంలో భౌతిక ప్రయోజనాలు. స్వార్థపరత్వం మనో కాంక్షలను మించి వేరే యేమీ ఉండజాలదు. కొన్ని రొట్టె ముక్కలు కామ వాంఛలు, రాజకీయ పదవులు , నృత్యగాన సమావేశాలు, భోగ భాగ్యాల సామాగ్రి ప్రతియేటా పెరిగే బ్యాంకు బ్యాలెన్సు ఇవి మాత్రమే వారి జీవితం యొక్క తొలి మరియు తుది లక్ష్యం. భౌతిక వాదంలో సత్ప్రవర్తన, మానవత్వం మొదలగు పదాలకు చోటు లేదు చెందిన మానవుడు కూడా అభివృద్ధి చెందిన ఒక పశువేనని దాని అభిప్రాయం అందువల్లనే భౌతిక వాదులు పశువులను మృగాలను తమకు ఆదర్శంగా భావిస్తారు. తమ స్వల్ప ప్రయోజనాల కోసం అతిహీన స్థితిని భరించడానికి మరియు దౌర్జన్యం సహించడానికి కూడా వెనుకాడరు. వారిస్థితి పూర్తిగా శునకాన్ని పోలి ఉంటుంది. యెందుకంటే శునకం ఒక చిన్నరొట్టుముక్కకోసం తనతోక ఊపుతూ తన నాలుకను బయటకు తీసి చూపుతూ ఉంటుంది. ఒక చిన్న ఎంగిలిఎముక కోసం తన తోటి కుక్కలను చెండాడుతుంది. నీచ దశాభావనకు గురియైన ఈ మానవుడు ధనాధికారాలు పొందగానే ఉచ్ఛదశాభావన మరియు గర్వాహంకారాలకు ప్రతిరూపంగా నిలుస్తాడు. ఒకప్పుడు దైవాస్తికతను నిరాకరించిన ఈ మట్టిబొమ్మ మానవుడు స్వయంగా తానే దేవుడనే భావనకు గురియవుతాడు. ఒక అతని దౌర్జన్యం నియంతృత్వాలకు అంతూ, హద్దూ ఉండవు.

నాస్తికతా, దృక్పథం ప్రజలలో వ్యాపించగానే ఈ లోకంలో స్వార్థం ద్రోహం అక్రమసంపాదన, దొంగతనం, దోపిడి జగడం పోట్లాట, వినాశం మొదలైనవన్నీ పెచ్చరిల్లిపోతాయి. మానవసమాజం ఆకలిగొన్న తోడేళ్లవలె, రక్తదాహం గల మృగాలవలె భయంకరపిశాచాలవలె మారిపోతుంది. భౌతిక వాదాన్ని, నాస్తికతను స్వీకరించిన తర్వాత మానవునికి లభించే ఫలితం ఇదే కానీ మానవుని అసలు గమ్యస్థానం ఇదేనా ?

పై విషయాల ద్వారానాస్తికత ఒక భయంకర వినాశకారియని ఋజువైంది. ఇక అంతకంటే మించిన ఒక భయంకర వినాశకారి గురించి తెలుసుకుందాం .అదియే బహుదైవారాధన । ఇది నాస్తికత కంటే అతినీచం నాస్తికత వల్ల మానవుడు పశువుగా మారిపోతాడు. గాని బహుదైవారాధనా స్వీకారంవల్ల పశువులను పూజించే నీచదశకు అధోగతికి దిగజారుతాడు ఒక్క పశువులను మాత్రమే గాక నదులు, సముద్రాలు, కొండలు పర్వతాలు మట్టి, ధూళి, అగ్నిపాములు తేళ్లు, క్రిములు, కీటకాలు మొక్కలు వృక్షాలు, స్త్రీ-పురుష మర్మాంగాలు ఈ విధంగా ప్రతి వస్తువునుతనకు దైవంగా భావిస్తాడు వాటినే భాగ్యదాతలుగా భావించి వాటిఎదుట సాష్టాంగాలు చేస్తాడు మానవుని కొరకు ఇంతకంటే దిగజారిన నీచదశ మరియు అధోగతి వేరే యేమైనా కాగలదా ?

అసలు దేవుని విడనాడి ప్రతి చిన్న, పెద్ద వస్తువులను దైవంగా భావించియెదుట వంగిదండాలు పెట్టి సాష్టాంగాలు చేసి నీచదశకు అధోగతిపాలైన వ్యక్తి స్వయంగా తానే దేవుడనే భావనకు గురియై ప్రజలను కూడా నమ్మింప జూస్తాడు. అనగా ధార్మిక పీఠాలను అలంకరించే పెద్దలు తామే దైవమని, దేవుని అవతారమని బొంకుతు ప్రజలచేత నమ్మిస్తారు. సామాన్య ప్రజలు మోసపోయి ఆ బూటకపు కపట మూర్తులనే దైవాలుగా దైవ అవతారాలుగా

నమ్మి వారిని పూజించడం వల్లనే తమకు మోక్షం లభిస్తుందని మూఢంగా విశ్వశిస్తారు.

నాస్తికత. బహుదైవారాధన ఈ రెంటివల్ల దుష్ఫలితాలే జనిస్తాయి, గాని సత్ఫలితం లభింపజాలదు. ఇస్లాంబోధించిన ఏకదైవారాధనను నిరాకరించటం వల్లనే మానవజాతి సత్ఫలితాలను కోల్పోయి దుష్ఫలితాలకు గురైంది. నాస్తికత మరియు బహు దైవారాధన వల్ల కలిగే యదార్థమేమిటంటే అల్లాహ్ ఒక్కడే దేవుడు ఆరాధ్యుడు. ఆయన తప్ప వేరే యెవ్వరికీ ఆరాధింపబడే అర్హత లేదు,. అల్లాహ్ తప్ప వేరే యెవరూ ప్రభువు పోషకుడు భాగ్యదాత, రక్షకుడు కాజాలరు. జీవన్మరణాలు లాభనష్టాలు ఉచ్ఛనీచాలు ధనాధికారాలు అన్నీ అల్లాహ్ చేతిలోనే ఉన్నాయి. ఎవరైనా సరే రాజు, మతగురువు, ప్రవక్త, సజ్జనుడు, దేవదూత, జంతువు, పశువు, వస్తువు, ఈవిధంగా యెవరైనా సరే వారికి ఆరాధింపబడే హక్కు లేదు. ఎందుకంటే వారందరూ అల్లాహ్‌కు దాసులే వారు కూడా అల్లాహ్‌నే ఆరాధించాలి మానవుడు ఈ భూలోకంలోదేవుని ప్రతినిధి. కాబట్టి దేవుని సంతుష్టపరచటం కోసమేతన జీవితాన్ని అంకితం చేయాలి.

ఈ విధంగా మానవుడు ఇతర సృష్టిరాశుల యెదుట వంగి హీనంకాకుండా నీచదశకు దిగజారకుండా భద్రపడి తన ఉన్నత స్థానాన్ని అందుకోగలడు. ఏకదైవారాధన వల్ల ప్రాప్తమయ్యే ఈ ఉన్నతస్థానం మరియు ఉచ్ఛ స్థితి వేరే యే విధంగానూ లభింపజాలదు. ఏక దైవారాధన యొక్క సత్ఫలితాలు అనేకం. వాటిలో కొన్నింటిని తెలుసుకుందాం. మానవుడు పట్టపగ్గాలు లేని విచ్చల విడి జంతువు కాదని, తన ప్రభువు యెదుట తన చేతలకు సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉందని ఏకదైవారాధన వల్లనే తెలుస్తుంది. మానవుడు దేవుని దాసుడే గాని మనోకాంక్షలకు

దాసుడు కాదని అతని జీవిత లక్ష్యం క్రమం క్రమపద్ధతిలో భౌతిక ఆశయాల సిద్ధికాదని మానవత మరియు సన్మార్గం ఆచరించి దేవుని సంతుష్టపర్చి శాశ్వత స్వర్గభాగాల్యను పొందటమే తన జీవిత లక్ష్యమని అతనికి అర్థమవుతుంది. అతను అక్రమ ప్రయోజనాలు మరియు మనోకాంక్షల అందమైన వలలో చిక్కుకుంటే సర్వలోకప్రభువైన అల్లాహ్ తనపట్ల కోపగించి విచారణ దినాన తనను ఘోరమైన శిక్షకు గురిచేయునని గ్రహించి దుష్కార్యాలను విడనాడి సత్కార్యాలు చేస్తు తాను కృతార్థుడై ఈ లోకంలో శాంతి శుభాలు ఏర్పడుటకొరకుతోడ్పడిన వాడవుతాడు. ఏకదైవారాధకుని జీవిత లక్ష్యం యేమిటంటే ప్రజలకు దైవేతర ఆరాధనల నుండి వారించి ఒకే ఒక దేవుడైన అల్లాహ్ ఆరాధన వైపుకు మరల్చాలి. మానవుడు ఈ బాధ్యత తెలిసికూడా దాన్ని నెరవేర్చకపోతే లేదా తనకు తాను దైవంగా జేసి ప్రదర్శిస్తే అతనికి ఘోర శిక్ష తప్పదు. వ్యక్తికి, సమాజానికి, జాతికి, సర్వమానవాళికి తప్పనిసరి. సద్గుణాలకు ఉదాహరణ : సత్కార్యాలు, కత్యసంధత, వాగ్దాన నిర్వహణ, నీతి, న్యాయం, న్యాయరక్షణ, దయ, కరుణ, విధినిర్వహణ, సత్య సహకారం మొదలగునవి. ఈ సద్గుణాలు ఉన్న వ్యక్తి ఉత్తమ వ్యక్తి అనడంలో సందేహం ఉండజాలదు. అతనికి ప్రతి అడుగానా అందలం లభిస్తుంది. అతని ఉనికి పూర్తిసమాజం కొరకు దయాకారణం అవుతుంది. ఈ సద్గుణాలు పూర్తి జాతిలో ప్రసరిస్తే ఆ జాతిలో సోదర భావం, ప్రేమ, ఐకమత్యం ఏర్పడతాయి. ఆ జాతి క్లిష్ట సమస్యలు చిటికెల్లో పరిష్కారమవుతాయి. దానికోసం కృతార్థతా ద్వారాలు తెరచుకుంటాయి. దానికి ఉనికి ఇతరజాతులకు దయాకారణం అవుతుంది.

ఇక దుర్గుణాలను చూడండి; అవినీతి వాగ్దానభంగం,

ద్రోహం, మోసం, అన్యాయం, అసత్యం, దౌర్జన్యం, కఠిన మనస్తత్వం, బాధ్యతా విస్మరణ మొదలగునవి. ఇవి అతి దిగజారిన దుర్గుణాలు. ఈ దుర్గుణాలుగల వ్యక్తిని రాక్షసుడు అనడంలో సందేహం లేదు. అటువంటి వ్యక్తి పూర్తి సమాజానికి, పూర్తి జాతికి, సర్వమానవాళికి ఒక శాపం వంటివాడు. ఈ దుర్గుణాలు పూర్తి జాతిలో ప్రకోపిస్తే ఆ జాతి ఇతర జాతులన్నిటికీ ఒక శాపం అవుతుంది. ఈ దుర్గుణాలు సర్వమానవాళి యందు ప్రసరిస్తే ఈ లోకం సుఖశాంతుల కోసం అల్లాడిపోతుంది. మానవాళిశక్తులు పరస్పర యుద్ధంలో మునిగి ఈ లోకం నరకకూపంగా తయారవుతుంది.

సారాంశమేమిటంటే ఈ లోకంలో సద్గుణాల ప్రాముఖ్యత మరియు అవసరం చాలా ఉంది. ఈ అవసరం ప్రతి కాలంలోను ఉండేదిగానీ నేడు దానియవసరం చాలా పెరిగిపోయింది. ఎందుకంటే నేటి మానవుడు వివిధ విద్యారంగాల్లో ప్రగతి సాధించాడు, అనేక శక్తులు అతని ఆధీనంలోకి వచ్చాయి. అతను కనురెప్పపాటులో లక్షలాది ప్రజలను నాశనం చేయగలడు. అంతేకాక లక్షలాది ప్రజల కొరకు కృతార్థతావకాశం ఏర్పరచగలడు. అతను భూగ్రహాన్ని విడనాడి ఆకాశంలోని ఇతర గ్రహాలపైన తన ఆధిక్యత కోసం కలలు కంటున్నాడు. రాకపోకల సాధనాల వల్ల పూర్తి భూమండలం ఒకే ఒక ప్రాంతంలా కానవస్తుంది. దీని పరిధి చంద్రుడు మరియు అంగారకుని వరకు వ్యాపించినట్లు అనిపిస్తుంది. ఇటువంటి సమయంలో ప్రపంచ జాతులు దుర్గుణాలకు లోనైతే ఇక మానవాళి గతియేమిటో వేరే చెప్పనక్కర్లేదు.

ఏకదైవారాధన సంఘ సంస్కరణ : ఏక దైవారాధన వల్ల స్పష్టమయ్యేదేమిటంటే అల్లాహ్ ఒక్కడే దేవుడు, ప్రభువు, అసలు ఆరాధ్యుడు సర్వసృష్టిరాశులూ ఆయనకే

సాష్టాంగం చేస్తూ మనసా వాచా ఆయనపట్ల విధేయత కలిగి ఉన్నాయి. కాబట్టి మనం కూడా ఆయన యెదుటనే వంగాలి. ఆయనయే సృష్టికర్త లాభ నష్టాల యజమాని జీవన్మరణాల అధికారి. మనం చేతులు చాచి ఆయన యెదుటనే భిక్షం కోరాలి. సహాయం కోసం ఆయన్నే వేడుకోవాలి. ఒకప్పుడు వివిధ దుర్గుణాలకులోనై ఉన్న అరబ్బువాసులు ఇస్లాం బోధించిన ఏకదైవారాధనా దృక్పథాన్ని స్వీకరించి, పరిశుద్ధులై సకల సద్గుణాలకు ప్రతిరూపులై ఆదర్శంగా నిలిచారు.

మానవుడు ధనసంపదల యాజమాన్యం తనదేనని భావించినంత వరకు అతని మనసు దురాశ, పిసినారితనం, ఈర్ష్య, ద్వేషం మొదలగు మలినాలతో నిండి ఉంటుంది. కానీ అతను ఏకదైవారాధన యందు విశ్వాసం ఉంచుతూ, సర్వభూమ్యాకాశాల సంపదా నిధుల యాజమాన్యం అల్లాహ్ ఒక్కనికే చెందునని గ్రహించినంతనే, తాను ఆ ధన సంపదల అసలు యజమాని కాదని, తానొక గణకుడు మాత్రమేనని తెలుసుకుంటాడు. ధనం వల్ల అతి సంతోషమూ కలుగదు. లేమి వల్ల విచారమూ కలుగదు.

ఈ సిద్ధాంతం తెలిసిన తర్వాత, అల్లాహ్ యందు విశ్వాసం ఉంచు వ్యక్తి దురాశ, పిసినారితనం, ఈర్ష్య మొదలగు దుర్గుణాలను యెలా లోనవుతాడు.? అతని సిరి సంపదలన్నీ తాత్కాలిక వ్యాసాలే. అతని మరణం తర్వాత వాటిపై అతని అధికారం ఉండదని తెలిసిన తర్వాత ఇక దురాశా పిసినారితనాలు యెందుకు?

ఏకదైవారాధకుడైన విశ్వాసి తాను పాలకుడుకాదని, పాలితుడని యజమానికాదని, సేవకుడని, పోషకుడు కాదని, పోషితుడని, ప్రభువు కాదని, దాసుడని, నమ్మినతర్వాత అతని మనసులో గర్వం, అహంకారం పరహీనత మొదలగు మలినాలు యెలా

చోటుచేసుకోగలవు?

ఒక వ్యక్తి యేక దైవారాధన యందు విశ్వాసం ఉంచి, అల్లాహ్ ఒక్కడే లాభనష్టాల యజమాని అని నమ్మిన తర్వాత లోకశక్తులపట్ల గల ఆశా భయాలన్నీ దూరమైపోతాయి. తన ఆశాభయాలను ఒకే ఒక దేవుడైన అల్లాహ్ పట్లనే కేంద్రీకరిస్తాడు. అతని కోపోద్రేకాలు మటుమాయమవుతాయి. తన జీవితంలో ఎదురయ్యే ప్రతి బాధా, దేవుని హెచ్చరికయని, తన తప్పులను సరిదిద్దుకోవటం కోసమేనని, దాని వల్ల దైవసామీప్యం లభిస్తుందని, సైతాను గాయపడి పారిపోతాడని నమ్మినతర్వాత ఇక కోపోద్రేకాలు మనసులో యెలా ప్రవేశించగలవు?

ఒక వ్యక్తి పరులు లాభ నష్టాలు కలిగించగలరనే ఆశాభయాలు కలిగి ఉండటం వల్లనే వారిని సంతుష్ట పర్చడానికై సంకల్ప శుద్ధిని విడనాడి పర పొగడ్తల ఆపేక్షకు, ఆడంబరాలకు లోనవుతాడు. కానీ ఒక్క అల్లాహ్‌యందు మాత్రమే విశ్వాసం ఉంచు ఏకదైవారాధకుడు తన విశ్వాస బలిమి వల్ల, పరపొగడ్తల ఆపేక్షను విడనాడి, సంకల్ప శుద్ధితో తన కార్యాలను అల్లాహ్ కొరకే అంకితం చేస్తాడు.

సారంశమేమిటంటే మానవుడు బహుదైవారాధనను విడనాడి, ఏకదైవారాధనను స్వీకరించి ఒకే ఒక అల్లాహ్‌ను ఆరాధింపనారంభిస్తే దుర్గుణాలన్నీ దూరమై సద్గుణాలన్నీ జనిస్తాయి.

# ఇస్లాం ఒక సద్గుణ బోధిని

మనందరి దేవుడైన అల్లాహ్ తన సత్యప్రవక్త ముహమ్మద్ ( స్వల్లల్లాహు అలైహివసల్లం) ను సంభోదిస్తూ, పొగడ్తగా ఇలా పలికెను. ఓ ప్రవక్తా ! అతి నిశ్చయంగా తమరు అత్యుత్తమ సద్గుణాలు కలిగి ఉన్నారు. (అల్ ఖలం : 4).

దైవ ప్రవక్త గారి సతీమణియైన ఆయిషా (రజియల్లాహు అన్ హా) ఇలా తెలిపారు. దైవప్రవక్త ముహమ్మద్ గారి సద్గుణాలు దివ్యఖుర్ ఆన్‌కు ప్రతిరూపంగా ఉండేవి. (ముస్లిం, అహ్మద్, నసాయీ)

పై ప్రవచనం అర్థం యేమిటంటే దైవప్రవక్త ముహ్మద్ దివ్యఖుర్ఆన్ ఆదేశాలు బోధించుటమే కాక వాటి ప్రకారం స్వయంగా ఆచరించి చూపినారు. దివ్యఖుర్ఆన్ వేటిగురించి ఆదేశించెనో వాటి ప్రకారం ఆచరిస్తూ , వేటిగురించి వారించెనో వాటికి అతి దూరంగా ఉండేవారు..

ఇక ఇస్లామీయసద్గుణాలు మరియు సత్ప్రవర్తనలగురించి కొన్ని ముఖ్య విషయాలు తెలుసుకుందాం ! దివ్యఖుర్ఆన్‌లో ఇలా తెలుపబడింది. "క్షమా గుణమును అలవర్చుకొనుము. సత్కార్య బోధన చేయుము. అజ్ఞానులతో వృధావాదన చేయకుము"

(అల్ అఅరాఫ్ : 199)

దైవ ప్రవక్త ముహమ్మద్ ఇలా పలికినారు: "ఉత్తమ సద్గుణాలను పరిపూర్ణ పరచుటకే నేను దైవ ప్రవక్తగా ప్రభవింపబడినాను." (మువత్తా).

ఇస్లాం ధర్మంలో నమాజు, ఉపవాసం ధర్మదానం మొదలగు మూలా దేశాలతో పాటు సద్గుణాలకు కూడా అత్యంత ప్రాముఖ్యత కలదు. దైవప్రవక్త ముహమ్మద్ ఇలా పలికినారు : "రేయింబవళ్ళ దేవుని ఆరాధిస్తూ ప్రార్థించటంవలన యెంతటి గొప్పస్థానం లభించునో అంతటి గొప్ప స్థానాన్ని మానవుడు తన సద్గుణాల ద్వారా కూడా పొందగలడు" (అబుదావూద్) దైవప్రవక్త గారు ఈ విధంగా కూడా బోధించారు. "మీ యందు సత్ప్రవర్తనగలవారే అందరికంటే గొప్పవారు". (బుఖారీ) మరొక ప్రవచనంలో ఇలా తెలుపబడింది. "విచారణ దినమునాడు న్యాయ త్రాసులో సద్గుణములను మించి తూగు వస్తువు మరొకటి ఉండదు". "సద్గుణ సంపన్నుడైన వ్యక్తి తన సద్గుణాల ద్వారా ఆరాధనా సంపన్నుడైన వ్యక్తి యొక్క ఉన్నత స్థానానికి చేరుకోగలడు" (అబూదావూద్) మరొక ప్రవచనంలో ఇలా పేర్కొనబడింది: "సద్గుణాలకు మించిన సంపదలేదు." (నసాయీ) ఇంకొక ప్రవచనంలో యిలా బోధింపబడింది. "సద్గుణవంతులే అల్లాహ్‌కు అతి ప్రియమైన వారు" (తబ్రానీ) దైవప్రవక్త ముహమ్మద్ (స్వల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా కూడా ఉపదేశించారు. "ఇహలోకంలో యెవరైతే సద్గుణాలు కలిగి వుంటారో, పరలోకంలో వారే నాకు ప్రియమైన వారుగా, నాకు సామీప్యులుగా నుంటారు. ఇహలోకంలో యెవరైతే దుర్గుణాలు కలిగి వుంటారో వారు అసహ్యకరంగా, నాకు అతి దూరంగా నుంటారు" (అహ్మద్, తబ్రానీ, బైహఖీ).

ఇక ఇద్దరు స్త్రీల వేర్వేరు ప్రవర్తనలు మరియు వాటి ఫలితాల గురించిన ఒక వృత్తాంతం తెలుసుకుందాం. ఒక స్త్రీ రాత్రంతా మేల్కొని ఆరాధనా ప్రార్థనలు చేస్తూ ఉండేది. ప్రతి దినం ఉపవాసం ఉండేది. దానధర్మాలు అత్యధికంగా చేసేది. కానీ

తన నోటి దురుసుతనం వలన ఇరుగు పొరుగు వారికి తల ప్రాణం తోకకు వచ్చేలా చేసేది.

మరొక స్త్రీ ముఖ్యమైన తప్పనిసరియైన అరాధనలే చేస్తూ ఉండేది. తప్పని సరియైన ఉపవాసాలే ఉండేది. తన స్థోమత ప్రకారం పేదవారికి దుస్తులు దానం చేసేది. కానీ సద్గుణవతి కావటం వలన యెవరినీ బాధించేది కాదు.

దైవప్రవక్త గారి అనుచరులు ఈ ఇద్దరు స్త్రీల ఫలితాలగురించి ప్రశ్నించగా దైవ ప్రవక్తగారు ఇలా సమాధానమిచ్చారు. "మొదటి స్త్రీ తన దుష్ప్రవర్తనా దుర్గుణాల వల్ల నరకశిక్ష అనుభవించటం తప్పనిసరి. రెండవ స్త్రీ తన సత్ప్రవర్తనా సద్గుణాలవల్ల తప్పకుండా స్వర్గప్రవేశం చేయును" (అమ్మద్, బైహఖీ)

ఇక మరొక ఉపదేశపూరిత ప్రవచనాన్ని తెలుసుకుందాం:

ఒక గ్రామవాసియైన ముస్లిందైవప్రవక్త ముహమ్మద్ గారి సమక్షానికి వచ్చి ఇలా విన్నవించుకున్నాడు: ఏ కార్యము వల్లనైతే నేను స్వర్గప్రవేశం చేయగలనో ఆ కార్యములు నాకు తెలపండి. అపుడు దైప్రవక్తగారు ఇలా ఉపదేశించారు: 1. బానిసకు స్వేచ్ఛ కల్పించుము. 2. ఋణగ్రస్తుని ఋణబంధనము నుండి విముక్తి కలిగించుము 3. బంధువులకు చేయూతనిమ్ము 4. పైకార్యములేమీ చేయలేకపోతే కనీసం ఆకలిగొన్న వానికి అన్నం పెట్టుము 5. దాహంగలవానికి నీరు త్రాగించుము. 6. సత్కార్యబోధిన 7. దుష్కార్యం చేయలేక పోతే కనీసం నీ నోటిని అదుపులో ఉంచుకొనుము.

దివ్యఖుర్ఆన్ వాక్యాల్లో పేర్కొనబడిన కొన్ని సద్గుణాల గురించి తెలుసుకుందాం: అమిత దయామయుడైన అల్లాహ్ యొక్క ప్రియదాసుల సద్గుణములు ఇవి: 1. వారు భువిపై

అతి అణకువతో నడుస్తారు. 2. వారికి అజ్ఞానులు ఎదురైతే సలాము పలికి సాగిపోతారు. 3. వారు రాత్రిపూటల్లో తమ ప్రభువు సమక్షాన సాష్టాంగాలు చేస్తూ నిలబడి ప్రార్థనలు చేస్తూ గడుపుతారు. 4. వారు యీ విధంగా ప్రార్థిస్తూ ఉంటారు. ఓ మా ప్రభువా! మమ్ము నరకశిక్ష బారి నుండి రక్షించుము. అతి నిశ్చయంగా నరకశిక్ష అతి భయంకరంగా ఉండును. నరకం అతి నిశ్చయంగా అత్యంత భయంకర నివాసం 5. సద్గుణవంతులు తమ ధనాన్ని వెచ్చించునపుడు వృథాగానే ఖర్చుచేయరు. పిసినారి తనమూ చేయరు. వారి వ్యయం మాధ్యమిక విధానంగా ఉంటుంది. 6. వారు అల్లాహ్‌ను విడిచి వేరేయెవరినీ పూజించరు. 7. అల్లాహ్ నరహత్యను నిషేధించెను కాబట్టి వారు అకారణంగా యెవరినీ హత్యచేయరు. 8. వారు వ్యభిచారం చేయరు.

ఎవరైతే ఈ పాపకార్యాలకు (అనగా బహుదైవారాధనకు హత్యకు, వ్యభిచారానికి) పాల్పడుదురో వారు తమ పాపాలఫలం పొందక తప్పదు. ప్రళయదినం నాడు వారికి వారి భయంకర శిక్ష రెట్టింపుచేయబడును. వారు అతిహీనులై శాశ్వతంగా ఆ శిక్ష పొందుతూ ఉంటారు. కానీ యెవరైతే మరణానికిముందే అల్లాహ్ సమక్షాన క్షమాపణ వేడుకుని, అల్లాహ్ యందు విశ్వాసం ఉంచి (ఇస్లాం స్వీకరించి) సత్కార్యములు చేయుదురో అల్లాహ్ వారిదుష్కార్యములను సత్కార్యములుగా మార్చివేయును .ఎవరైతే క్షమాపణ వేడుకుని సత్కార్యములు చేయుదురో వారు వాస్తవంగా అల్లాహ్ సమక్షాన క్షమాపణ వేడుకున్నట్లే. (అనగా వారి క్షమాపణ స్వీకరింపబడును)

8. సద్గుణవంతులు అబద్ధపు సాక్ష్యం పలకరు.

9. దారిలో అనవసరపు కార్యాలు ఎదురైతే వాటి వద్దనుండి

పుణ్యపురుషుల వలె సాగిపోతారు.

10. వారి ప్రభువైన అల్లాహ్ యొక్క వచనములు వినిపించి ఉపదేశం చేసినపుడువారు వాటిపట్ల అంధులు, చెవిటివారలుగా ప్రవర్తించరు (అనగా ఆ వచనములను శ్రద్ధగా విని, అర్థం చేసుకుని వాటి ప్రకారం ఆచరిస్తారు.)

11. వారు ఈ విధంగా ప్రార్థిస్తూ ఉంటారు : ఓ మా ప్రభువా! మాకు మా భార్యాబిడ్డల ద్వారా కంటి చలువ ప్రసాదించుము. మరియు మాకు దైవభక్తుల యందు ప్రథమస్థానం ప్రసాదించుము.

ఈ సద్గుణవంతుల సత్ఫలం యేమిటంటే వారికి వారి ఓర్పు సహన స్థిరత్వాలకు ప్రతిఫలంగా ఉన్నత స్వర్గనివాస భవనములు ప్రసాదింపబడును. వారికి అత్యంత గౌరవ మర్యాదలు మరియు సలాములతో సుస్వాగతం పలుకబడును. వారు వాటియందే శాశ్వతంగా ఉంటారు. వారి నివాసం అత్యంత శుభప్రదమైనది.

(అల్‌ఫుర్ఖాన్: వాక్యములు: 63 నుండి 78 వరకు)

దివ్యఖుర్ఆన్‌లో మరొకచోట సత్ప్రవర్తనలకు సంబంధించిన ఆదేశాలు ఈ విధంగా పేర్కొనబడినవి. నీ ప్రభువు ఆజ్ఞయేమనగా;

1. అల్లాహ్ తప్ప వేరే యెవరినీ ఆరాధించవద్దు.

2. తల్లితండ్రులపట్ల అతి మంచివిధంగా ప్రవర్తించుము. నీ జీవిత కాలంలో వారిలో యెవరైనా ఒకరు, లేదా ఇద్దరూ వృద్ధాప్యానికి చేరుకున్నప్పుడు వారిని బాధపెట్టే చిన్నమాట కూడా పలకవద్దు వారిని గద్దించవద్దు . అతి మెత్తగా వారిని పలకరించుము. వారిపట్ల అత్యంత అణకువ, వినయం కరుణ, ప్రేమలతో ప్రవర్తించుము.

దేవుని సమక్షాన వారిద్దరికొరకు యీ విధంగా ప్రార్థించుము. ఓ నా ప్రభువా! నా తల్లితండ్రులు నా బాల్యంలో నన్ను దయా ప్రేమలతో యెలా పోషించారో నీవు కూడా అదేవిధంగా వారిపై దయ చూపుము. మీ మనసుల్లో యేముందో అల్లాహ్‌కు సంపూర్ణంగా తెలుసు. మీరు వాస్తవంగా సద్గుణవంతులైతే అల్లాహ్ క్షమార్థులను తప్పక క్షమించును.

3. బంధువుల పట్ల నీవు నెరవేర్చవలసిన విధి నెరవేర్చుము.

4. దీనులపట్ల, మార్గభత్యంలేని బాటసారుల పట్ల నీవు నెరవేర్చవలసిన బాధ్యత నెరవేర్చుము.

5. నీవు వృధా వ్యయం చేయకుము. వాస్తవమేమిటంటే వృధా వ్యయం చేయువారు సైతానులకు సోదరులు, సైతాను తన ప్రభువు పట్ల కృతఘ్నుతగా ప్రవర్తించెను.

కానీ నీవు దానధర్మాలు చేసే స్థోమత లేక నీ ప్రభువు తన దయతో నీకు ప్రసాదించు భాగ్యములు కోరుతూ గడుపుస్థితిలో ఉంటే ఆ పేదవారికి మెత్తగా నచ్చజెప్పుము.

6. నీ చేతిని నీ మెడకు వేసి కట్టుకోవద్దు (అనగా పిసినారితనం చేయవద్దు).

7. కానీ నీచేతిని పూర్తిగా కూడా తెరవవద్దు (అనగా హద్దు మీరి వృధా వ్యయం చేయవద్దు) అటువంటి పారపాటు చేస్తే నీవు దూషింపబడి పశ్చాత్తాపపడతావు. అతినిశ్చయంగా నీ ప్రభువు తన ఇష్టం వచ్చిన వానికి లెక్కలేనంతగా జీవన భాగ్యములు ప్రసాదించును. మరియు తన ఇష్టం వచ్చిన వానికి మితంగా ప్రసాదించును అతి నిశ్చయంగా దేవుడు తన దాసుల వాస్తవాలను గురించి తెలిసినవాడు ఆయన సర్వాన్ని చూస్తున్నాడు.

8. మీరు పేదరికానికి భయపడి మీ పిల్లలను చంపుకోవద్దు. వారికి మరియు మీకు మేమే ఆహారం ప్రసాదింతుము. పిల్లలను చంపటం అతి నిశ్చయంగా అతి భయంకర పాపం.

9. మీరు వ్యభిచారానికి సమీపంగా కూడా వెళ్ళవద్దు. వ్యభిచారం అతి నిర్లజ్జకార్యం, మరియు అతి దుష్ట కార్యం.

10. అల్లాహ్ నరహత్యను నిషేదించెను. కావున అకారణంగా యెవరినీ హత్యచేయవద్దు. ఎవరైతే దౌర్జన్యంగా హత్య చేయబడునో అతని వారసునికి అత్యంత గొప్ప అధికారం ప్రతీకారం తీర్చుకునే లేదా మృత పరిహారం తీసుకునే-లేదా- క్షమించే; అధికారం ప్రసాదించాము. అతను ప్రతీకారం తీర్చుకోదలచుకుంటే హంతకుని హత్యలో హద్దు మీరకూడదు (హంతకుని తప్ప ఇతరులను శిక్షింపకూడదు). నిశ్చయంగా అతడు (హతుని వారసుడు) సహాయం పొందినాడు.

11. అనాథల సొమ్ము సమీపానికి కూడా పోవద్దు. కానీ వారి పట్ల అతి మంచి విధంగా ప్రవర్తించండి. వారు యుక్త వయస్కులయ్యే వరకు వారి బాగోగులు చూడండి (అనగా ఆ తర్వాత వారి సొమ్ము వారికప్పగించండి).

12. మీరు చేయు వాగ్దానాలను నెరవేర్చండి. విచారణ దినాన మీ వాగ్దానాల గురించి ప్రశ్నింపబడును.

13. మీరు కొలుచునపుడు పూర్తిగా కొలిచి ఇవ్వండి. తూచునపుడు సరియైన త్రాసు ద్వారా తూనిక వేసి ఇవ్వండి. ఇదే అతి మంచి విధానం మరియు సత్ఫల కారణం.

14. నీకు తెలియని వాటిని గురించి అంధానుసరణ చేయకుము. వాస్తవమేటిటంటే చెవులు, కనులు, హృదయం; వీటన్నిటి

గురించి ప్రళయ దినాన ప్రశ్నింపబడును.

15. నీవు భువిపై అహంకారంతో నడువకుము. నీవు నీ అహంకారం వల్ల భూమిని చీల్చలేవు. మరియు ఎత్తులో పర్వతాలను మించలేవు.

పై పేర్కొన్న దుష్కార్యాలన్నీ నీ ప్రభువు వద్ద దుష్టకార్యాలుగా ఎంచబడినవి. ఓ ప్రవక్త ముహమ్మద్ ఇవియన్నీ మీ ప్రభువు దైవవాణి ద్వారా మీకు అందజాసిన వివేకపూరిత హితవులు. మీరు అల్లాహ్‌కు తోడుగా వేరేయెవరినీ అరాధ్యులుగా ఎంచవద్దు. అలాచేస్తే (అనగా అల్లాహ్‌కు సాటి కల్పిస్తే) దూషింపబడి, బహిష్కరింపబడి నరకంలో పారవేయబడతారు.

(బనీ యిస్రాయీల్) యీ వాక్యములు 23 నుండి 39 వరకు

అలాగే వాస్తవసద్గుణాలు మరియు సద్గుణవంతుల గురించి దివ్యఖుర్ఆన్‌లో యే విధంగా విశదపరచబడిందో తెలుసుకుందాం; అల్లాహ్ ఈ విధంగా తెలిపెను: తూర్పు పడమర దిశలకు అభిముఖంకావటం ఒక్కటే సత్కార్యం కాదు. వాస్తవానికి ఈ క్రింది సద్గుణాలు కలిగి ఉండటమే అసలు సత్కార్యం. ఆ సద్గుణాలు గల సద్గుణులు యెవరంటే; వారు అల్లాహ్‌యందు, అంతిమ దినమందు, దైవదూతలయందు, దైవ గ్రంథమునందు దైవప్రవక్తలయందు విశ్వాసం కలిగి ఉంటారు. వారు తమకు డబ్బు అవసరం ఉన్నప్పటికీ బంధువుల కొరకు, బాటసారులకొరకు, బిచ్చగాళ్ళకొరకు, బానిసలకు స్వేచ్ఛ కల్పించుట కొరకు తమ ధనం దాన రూపంలో వెచ్చిస్తారు. వారు నమాజ్ (దైవారాధన) స్థాపనము చేయుదురు, జకాత్ (ధర్మ దానం) చెల్లించెదరు. మరియు వారు వాగ్దానము చేసిన తర్వాత తమ వాగ్దానములను నెరవేరుస్తారు. వారు లేమియందు. కష్టబాధలయందు, ధర్మయుద్ధ

సమయాన ఓర్పు, సహన స్థిరత్వాలతో ప్రవర్తిస్తారు. వీరే యదార్థ సత్యవిశ్వాసులు, మరియు వీరే అసలు దైవభక్తులు. (అల్ బ ఖరహ్ : 177).

కావున అల్లాహ్‌ను గురించిన విధులు మరియు తోటి మానవుల గురించిన బాధ్యతలు నెరవేర్చటమే అసలు సత్కార్యమని పై వాక్యం ద్వారా స్పష్టమవుతోంది. మరొక విధంగా చెప్పాలంటే సర్వసత్య విశ్వాసాలు, సర్వసత్కార్యాలు మరియు సర్వసద్గుణాలు ఒకే ఒక వాక్యంలో సమకూర్చబడినవి.

ఇక దివ్యఖుర్ ఆన్‌లో పేర్కొనబడిన కొన్ని ఉత్తమ ఇస్లామీయ బోధనలు తెలుసుకుందాం: సత్యం పలకాలి, సద్బోధన చేయాలి క్షమిస్తూ ఉండాలి, అల్లాహ్‌నే నమ్ముకోవాలి. సహనంతో ఉండాలి అల్లాహ్‌కు ధన్యవాదాలు అర్పిస్తూ ఉండాలి. ఇస్లాంపై స్థిరంగా ఉండాలి, అల్లాహ్ మార్గంలో ప్రాణాలు ధారపోయాలి, దానధర్మాలు చేయాలి. పిసినారితనం ఉండకూడదు. దుబారా ఖర్చు చేయకూడదు; బంధువులు, చుట్టాలు , అనాధలు, పేదలు, ఇరుగు పొరుగు వారు మొదలగు వారందరిపట్ల మంచిగా ప్రవర్తించాలి; పేద బాటసారులు, యాచకులు మరియు పేద బంధువులకు సహాయం చేయాలి; బానిసలు మరియు ఖైదీలపట్ల సరిగా వ్యవహరించాలి, గర్వించరాదు, వాగ్దానాలు నెరవేర్చాలి, ఆడినమాట తప్పరాదు, ఎల్లప్పుడూ మంచిమాటలే పలకాలి, పరస్పరం స్నేహాన్ని పెంచాలి, యెవరినీ తిట్టరాదు. అవహేళన చేయరాదు, తప్పుడు పేర్లతో పిలువరాదు, తల్లితండ్రుల సేవచేయాలి. వారికి విధేయతగా ఉండాలి, పరస్పరం మేలుకోరుతూ ఉండాలి, సత్యసాక్ష్యం పలకాలి, న్యాయంగా ప్రవర్తించాలి, సాక్ష్యాన్ని దాచకూడదు; సున్నితంగా, సరళంగా మాట్లాడాలి, అహంకారంతో నడవకూడదు. శాంతికై కృషిచేయాలి,

ఐకమత్యంగా ఉండాలి, తోటి ముస్లిం పట్ల సొంతసోదరులుగా ప్రవర్తించాలి, సర్వమానవాళిని సోదరులుగా భావించాలి, ధర్మసమ్మతమైన రీతిలో స్వయంగా సంపాదించాలి. యాచించడాన్ని హీనంగా భావించి దానికి దూరంగా ఉండాలి; సత్కార్యబోధన, దుష్కార్య నివారణ చేయాలి, సంతానాన్ని చంపుకోరాదు, ఆత్మహత్య చేసుకోరాదు, యెవరినీ హత్య చేయకూడదు, అనాధలను పోషించాలి, వారి సొమ్మును వారి కొరకు భద్రపరచాలి; తూకంలో, కొలతల్లో హెచ్చు తగ్గులు చేయకూడదు, దుర్మార్గం చేయకూడదు, లజ్జా విహీనతకు దూరంగా ఉండాలి, అశ్లీలపనులు చేయరాదు. అటువంటి పనులు చేసేవారిని వారించాలి.వ్యభిచారం చేయకూడదు. దృష్టి క్రిందికుండాలి, అనుమతి లేకుండా ఇతరుల గృహాల్లో ప్రవేశించకూడదు, నిండు దుస్తులు ధరించాలి (స్త్రీలు పరదాకూడా వేయాలి) మోసం, దగా చేయకూడదు; దృష్టిని, చెవులను, మనసును అదుపులో ఉంచుకోవాలి, సత్కార్యాలు చేయాలి, వృధాపనులు చేయరాదు. స్వార్థత్యాగం చేయాలి. శత్రువులను క్షమించాలి, అపకారులకుపకారం చేయాలి, అనవసరంగా , అతిగా కోపగించకూడదు, ఎదుటి వారిని గౌరవించి మాట్లాడాలి. ముస్లింమేతరుల విగ్రహాలను విమర్శించరాదు. నిందించరాదు; ఇతరులకు చేసినమేలు చెప్పి దెప్పి పొడవరాదు; ఆత్మస్తుతి చేసుకోరాదు; దుష్కార్యాలకు, దుశ్చేష్టలకు దూరంగా ఉండాలి దొంగతనాలు, దోపిడీలు చేయరాదు, అక్రమంగా ఇతరులసొమ్ము, ఆస్తి ఆక్రమించుకోరాదు; దైవభక్తి, పవిత్రత, సత్శీలతలతో ఉండాలి; తన గొప్పలు చెప్పుకోరాదు. అతి ప్రశాంతంగా ఠీవిగా నడవాలి, సమావేశాల్లో కూడా సత్ప్రవర్తనతో వ్యవహరించాలి. బలహీనులకు, నిస్సహాయులకు,అసమర్థులకు మరియు స్త్రీలకు ఉపకారం చేయాలి, వారికి తోడ్పడాలి స్త్రీవైతే తన భర్తకు

విధేయతగా ఉండాలి; పురుషుడైతే తన భార్యను గురించిన బాధ్యతలు నిర్వర్తించాలి. అసత్యప్రమాణాలు చేయరాదు; వాడీలు చెప్పరాదు, అపనిందలు మోపరాదు; శరీరాన్ని, గుప్తఅవయవాలను యెల్లప్పుడూ దాచి ఉండాలి; దేవునిభాగ్యాలను వ్యక్తపర్చాలి, యాచకులను చీదరించుకోరాదు. అనాధలను గద్దించరాదు, పరదూషణ చేయకూడదు; అనుమానించరాదు, అపార్థం చేసుకోరాదు, అందరిపై దయ తలచాలి, సంకల్పశుద్ధితో ఉండాలి, ఏ పనియైనాసరే పరుల పొగడ్తల కోసం, మెప్పుకోసం చేయరాదు. ఎవరైన అప్పడిగితే ఇవ్వాలి. అప్పు తీర్చలేకపోయిన వారిని క్షమించాలి; వడ్డీ, లంచం తీసుకోరాదు; యుద్ధరంగంలో వెనుతిరగకూడదు, స్థిరంగా ఉండాలి, ధైర్యసాహసాలతో ప్రవర్తించాలి, మత్తుపానీయాలు త్రాగరాదు, జూదమాడరాదు. పస్తులున్నవారి కడుపునింపాలి, అంతరంగిక, బహిరంగ అన్ని విధాల నిర్లజ్జకార్యాలకు దూరంగా ఉండాలి. ధనాన్ని ప్రేమించకూడదు. దౌర్జన్యాన్ని నివారించాలి, ఇతరులను నిర్లక్ష్యం చేయరాదు. పాపాలకు అతి దూరంగా ఉండాలి, పరస్పర సద్బోధన చేసుకుంటూ ఉండాలి. రసత్య సంధతతలో వ్యవహరించాలి.

ఇక దైవ ప్రవక్త ముహమ్మద్ (స్వల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రవచనాల్లో పేర్కొనబడిన కొన్ని ఉత్తమ ఇస్లామీయ బోధనలు తెలుసుకుందాం; బంధువులతో బంధుత్వం కలిగిఉండాలి. పిల్లలను ప్రేమించాలి. పెద్దలను గౌరవించాలి. తన కొరకు కోరుకునేదే ఇతరులకొరకు కూడా కోరాలి. ఇరుగుపొరుగు వారితో మంచిగా ప్రవర్తించాలి. బానిసలను క్షమించాలి. భార్యాబిడ్డలను బాగుగా పోషించాలి. విధవలకు సహాయపడాలి. గ్రుడ్డివారికి చేయూత నివ్వాలి. సర్వమానవాళి మేలుకోరాలి, ఇతరులకుపయోగపడాలి, అప్పిచ్చిన వారిని గౌరవించాలి.

విన్నవించుకున్నేవారి విన్నపాలు వినాలి. పశువులపై కూడా దయతలచాలి., సహాయకులకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. రోగులను పరామర్శించాలి, వారి సేవచేయాలి. అసూయపడరాదు. తమనాయకునికివిధేయులుగా ఉండాలి. సత్కార్యాలు శాశ్వతంగా చేస్తూ వుండాలి. కఠినంగా కాక తీయగా పలకాలి. సంస్కారవంతులుగా ఉండాలి. కోపాన్ని అదుపులో ఉంచాలి. కులవంశాల గొప్పతనంపై గర్వించకూడదు. ఇతరుల గృహాల్లో తొంగిచూడరాదు. తనతో పాటు ఇతరులకొరకుకూడా ప్రార్థించాలి. అల్లాహ్ ప్రసాదించిన దానితోనే సంతృప్తిపడాలి. తన తప్పులగురించి అల్లాహ్ సన్నిధిన క్షమాపణ వేడుకుంటూ ఉండాలి. చేసిన తప్పులను బహిరంగ పర్చకూడదు. ఇతరుల లోపాలను రహస్యంగా ఉంచాలి. అతిగా నవ్వకూడదు. అతిహాస్యం చేయకూడదు. రహస్యాన్ని రహస్యంగానే ఉంచాలి. ముఖస్తుతి చేయరాదు. అణకువ, వినయాలతో వ్యవహరించాలి. పక్షపాతం ఉండరాదు. ఇతరుల సుఖ దుఃఖాల్లో పాలుపంచుకోవాలి. దురాశ ఉండరాదు. విధిరాత నంగీకరించాలి. మరణించిన వారిపై శోకాలు పెట్టటం, అరుస్తూ ఏడ్వటం నిషేదం. పరస్పరం పోట్లాడుకోరాదు. శతృవులమధ్య సంధిచేయించాలి. ఒక ముస్లిం మరొక ముస్లింతో మూడు దినాలకంటే యెక్కువగా మాట్లాడకుండా ఉండరాదు. కపటత్వం వుండరాదు. బంధుమిత్రులతో కలిసిమెలిసి ఉండాలి. ముస్లింలు పరస్పరం సలాము చేసుకోవాలి, కరచాలనం చేసుకోవాలి భుజించటం, త్రాగటం, ధరించటం, నిద్రించటం,. లేవటం, కలవటం, మొదలగు వివిధ జీవనరంగాలలో ఇస్లాం ఆదేశాలను పూర్తిగా పాటించాలి. స్త్రీలు కూడా తమ బాధ్యతలు తెలుసుకుని వాటిని సంపూర్ణంగా నిర్వర్తించాలి.

సారాంశమేమిటంటే యెవరైతే సత్య విశ్వాసాలు,

సత్కార్యాలు మరియు సద్గుణాలయందు ఔన్నత్యం కలిగి ఉండున్,. అతనికి అల్లాహ్ సమక్షాన కూడా ఉన్నత స్థానమే లభించును.

"సలామ్" సదాచార వివరాలు: ముస్లింలు పరస్పరం ఎదురైనపుడు కలిసినపుడు ఆనందంతో వందనాపూర్వకంగా, మేలుకోరుతూ ఎదుటివాని కొరకు ప్రార్థిస్తూ "అస్సలాము అలైకుం" అని పలికితే ఎదుటి ముస్లిం దానికి జవాబుగా "వ అలైకు ముస్సలాం" అని పలకాలి . ఇది ఇస్లాం బోధించిన సదాచారం. దైవ ప్రవక్త ముహమ్మద్ (స్వల్లల్లహు అలైహివసల్లం) ఈ విధంగా ఉపదేశించారు: మీరు విశ్వాసులు కానంతవరకు స్వర్గంలో ప్రవేశించలేరు. మీరు పరస్పరం ప్రేమించినంతవరకు విశ్వాసులు కాలేరు. మీ మధ్య పరస్పరం ప్రేమ పెరగటానికి ఒక విధానం తెలుపుతాను. అదేమిటంటే మీరు పరస్పరం అత్యధికంగా "సలాము" చేసుకుంటూ ఉండండి." (ముస్లిం)

మరొక ప్రవచనంలో దైవ ప్రవక్తగారు ఇలా తెలిపారు: ప్రతి ముస్లిం తన తోటి ముస్లిం గురించి ఆరు బాధ్యతలు నెరవేర్చాలి. 1. అనారోగ్యంగా ఉంటే అతన్ని పరామర్శించాలి. 2. అతను మరణిస్తే అతని శవపేటికకు తోడుగా వెళ్ళాలి (అనగా మృతునిఖనన సంస్కారములయందు తోడ్పడాలి). 3. అతను ఆహ్వానిస్తే స్వీకరించాలి (లేదా రక్షించమని పిలిస్తే వెంటే చేరుకుని అతన్ని రక్షించాలి). 4. కలిసినపుడు సలాము చేయాలి. 5. అతను తుమ్మి "అల్‌హమ్‌దులిల్లాహ్" అంటే దానికి జవాబుగా "యర్‌హముకల్లాహ్" అని పలకాలి. 6. అతని ప్రత్యక్షంలోను, పరోక్షంలోను, అతని మేలు కోరాలి. (నసాయీ)

"సలాం" అను పదంలో అతి గొప్ప శుభభాగ్యాల

భావార్థాలు ఇమిడి ఉన్నాయి. దానిఅర్థం యేమనగా అల్లాహ్ నిన్ను, నీ ధనమానప్రాణాలను, నీ కుటుంబీకులను, నీ బంధువులను, నీధర్మాన్ని నీ విశ్వాసాన్ని , ఇహపరలోకాల్లో సర్వవిధాలా సురక్షితంగా ఉంచుగాక, నేను మనస్ఫూర్తిగా నీ మేలు కోరుచున్నాను. నీ పట్ల నా మనస్సులో యెటువంటి దుష్ట సంకల్పమూ లేదు.

దివ్యఖుర్ఆన్ తెలుపునదేమనగా ముస్లింల మరణ సమయాన వారి ఆత్మను గొనిపోవుటకు వచ్చు దేవదూతలు వారి సలాములు చేసి, స్వర్గశుభసందేశమిచ్చి వారి ఆత్మలను దేవుని అతిథ్యగృహములోనికి తీసుకుపోతారు (నహల్ :31, 32)

దివ్యఖుర్ఆన్‌లోని మరొక వాక్యం ప్రకారం దేవదూతలు స్వర్గద్వారాల వద్ద నిలబడి సజ్జనులకు సలాము చేస్తూ స్వర్గ ప్రవేశం కొరకు వారికి సుస్వాగతం పలుకుతారు. (జమర్ : 73)

అదే విధంగా, సజ్జనులు స్వర్గంలో ప్రవేశించిన తర్వాత కూడా దైవదూతలు వారికి సలాములు చేస్తారు. (రఅద్ : 23)

మనందరి దేవుడైన అల్లాహ్ స్వర్గవాసులకు తన సలాము వినిపించును. (యాసీన్ : 58)

మనం మన ఇంట్లో ప్రవేశించడానికి ముసుపు సలాము చేసిప్రవేశించాలి. (నూర్ : 61). ఒకవేళ ఇతరుల యింటికి వెళ్ళే అవసరం వస్తే ముందు సలాము చేసి, ఆ యింటి వారి అనుమతి తీసుకుని , వారు లోనికి రమ్మంటేనే లోపలికి వెళ్ళాలి. (నూర్ :27)

అంతేకాక మనం మార్గం గుండా పోవునపుడు చిన్నపిల్లలు

యెదురైతే వారికి కూడా సలాము చేయాలి. (బుఖారీ, ముస్లిం).

అదేవిధంగా అవసరానుసారం స్త్రీలు పురుషులకు, పురుషులు స్త్రీలకు సలాము చేయవచ్చు. (అల్ అదబుల్ ముఫ్రద్).

అలాగే ఉత్తరాల్లో కూడా సలాము వ్రాయటం సదాచారం, సలాము నోటితో పలకాలి గానీ చేతి సంజ్ఞలతోకాదు. కానీ యెవరైనా దూరంగా ఉంటే, అతనికి వినబడదనుకుంటే సలాము నోటితో పలుకుతూ, చేత్తో సంజ్ఞ చేయవచ్చు. మరొక విషయమేమిటంటే చిన్నవయస్కులు పెద్దవయస్కులకు; చిన్న సమూహం పెద్దసమూహానికి; వాహనంపై పోవువాడు నడచువానికి; నడిచి పోవుచున్న వ్యక్తి కూర్చున్న వ్యక్తికి ప్రారంభ సలాము చేయాలి. మరియు యెదుటివారు దానికి జవాబుగా ప్రతి సలాము చేయాలి. (అదబెముఫ్రద్-బుఖారీ)

ఇంకొక విషయమేమిటంటే ఏదైనా సభలో, సమావేశంలో ప్రవేశించినపుడు సలాము చేయాలి. అంతేకాకా ఆ సమావేశం నుండి వెడలునపుడు కూడా సలాము చేయాలి. కానీ సమూహంలో ఎవరైనా ఒక ప్రత్యేక వ్యక్తికి కాకుండా అందరికీ కలిపి సలాము చేయాలి. ఎవరైనా ప్రయాణంచేసి వెళ్తూ ఉంటే వాళ్ళచేత తన బంధు మిత్రుల కొరకు సలాము చేరవేయమని చెప్పి పంపించవచ్చు.

ఇప్పుడొక ప్రవచనంలోని కొన్ని ముఖ్యబోధనలు తెలుసుకుందాం, దైవప్రవక్త ఒకసారి ఇలా పలికారు, "మీరు మార్గములలో కూర్చోవద్దు" ఆయన అనుచరులిలా పలికారు, ఓ దైవప్రవక్తా! మార్గాల కిరువైపుల కాకపోతే ఇక మాకు కూర్చోడానికి వేరే స్థలము లేదుకదా; అపుడు దైవప్రవక్త ముహమ్మద్ యిలా పలికారు. "అయితే మార్గవిధులు నెరవేర్చండి." విధియేమిటని అడుగగా దైవప్రవక్త యిలా తెలిపారు. దృష్టిని

క్రిందకుంచుకోవాలి యెవరినీ బాధపెట్టకూడదు, సలాము చేయువారికి జవాబివ్వాలి, సత్కార్య బోధన చేయాలి. దుష్కార్యనివారణ చేయాలి. (బుఖారీ, ముస్లిం)

ఇంకొక విషయంయేమిటంటే ఎవరైనా "అస్సలాము అలైకుం" అని పలికి సలాము చేస్తే దానికి జవాబుగా సలాము పలుకుతూ మరికొన్ని ప్రార్థనా పదాలు కలిపి పలికితే పుణ్యం కూడా యెక్కువ లభిస్తుంది. ఈ పదాలు సలాము, ప్రతి సలాము రెంటిలో కూడా యెక్కువ చేయవచ్చు. ఉదాహరణకు : "అస్సలాము అలైకుం వరహ్మతు ల్లాహి వబరకాతుహు" దీనికి జవాబు : "వ అలైకుము స్సలాం వరహ్మతుల్లాహి వ బరకాతుహు".

అలాగే పరస్పరం కలిసినపుడు మొదట సలాములు పలికి తర్వాత మాట్లాడటం ప్రారంభించాలి.

ఒక గమనార్హ విషయం యేమిటంటే ముస్లింలు తమ తోటి ముస్లింల కొరకు సలాము చేయవచ్చుగానీ ముస్లిమేతరుల కొరకు సలాము చేయరాదు. వారికొరకు వేరే పదాలు ఉపయోగించవచ్చు. లేదా సంజ్ఞచేయవచ్చుగానీ వారికొరకు "అస్సలాము అలైకుం" అను పదాలు ఉపయోగించరాదు. సత్య దైవప్రవక్త ముహమ్మద్ (స్వల్లల్లాహు అలైవిహి వసల్లం) ముస్లిమేతర రాజ్యాధిపతులకు ఇస్లామీయ సందేశం పంపుతూ ఉత్తరం వ్రాయునపుడు సలాము కొరకు ఈ క్రింది పదాలు ఉపయోగించేవారు "సలామున్ అలా మనిత్తబఅల్ హుదా" (అనగా ఎవరైతే సన్మార్గమును అనుసరింతురో వారికి శుభం కలుగుగాక). కానీ ఒకే సభలో ఉన్నప్పుడు సలాము పలకటం కోసం "అస్సలాము అలైకుం" అని పలకవచ్చు( అదబెముఫ్రద్)

మరొక ముఖ్య విషయమేమిటంటే సలాము చేసిన

తర్వాత మానాభిమానాలు వ్యక్తం చేస్తూ కరచాలనం చేయాలి. కరచాలనం వలన సలాము ఆచారం పరిపూర్ణమవుతుంది. మరియు వారి పాపాలు సమసిపోతాయి. కానీ పరస్త్రీ పురుషులు కరచాలనం చేసుకోరాదు.

సలాము తర్వాత కరచాలనం చేయువ్యక్తి తన కుడిచేత్తో కరచాలనం చేయాలి. ఎదుటి వ్యక్తి కూడా తన కుడి చేత్తోనే కరచాలనం స్వీకరించాలి.(బుఖారీ, ముస్లిం, అహ్మద్).

# ఏక దైవారాధనా విశ్వాసం

ఒక ముఖ్యప్రశ్న: సర్వ మానవాళి సృష్టికి కారణం యేమిటి? ఈ ప్రశ్నకు జవాబు స్వయంగా అల్లాహ్ ఈ విధంగా తెలిపెను. సర్వజిన్నులు మరియు సర్వమానవులు నన్ను ఆరాధించుట కొరకే నేను వారిని సృజించాను. (జారియాత్ 56) పవిత్ర ఖుర్ఆన్‌లో ఆరాధన అనే పదం పేర్కొన్న ప్రతిచోట దాని యర్థం ఏకదైవారాధన అవుతుంది. దీని వల్ల వ్యక్తమయ్యేదేమిటంటే సర్వారాధనలు యెటువంటి సాటి లేని ఒక్క అల్లాహ్‌కే అంకితం చేయాలి. ఇదే విషయం పవిత్రఖుర్ఆన్‌లో ఇలా మరింత స్పష్టంగా పేర్కొనబడింది, అల్లాహ్‌నే ఆరాధించడండి. ఆయనకు యే విధమైన సాటీ కల్పించకండి (నిసా : 36)

దైవప్రవక్తలందరి సందేశాల సారాంశం యిదే": ఓ నాజాతికి చెందిన ప్రజలారా! అల్లాహ్‌నే ఆరాధించండి. మీకొరకు ఆయన తప్ప ఇతర ఆరాధ్యులెవరూ లేరు. అల్లాహ్ తప్ప వేరే ఇతరులెవరిని ఆరాధించవద్దు (అఅరాఫ్ : 59)

సర్వదైవ ప్రవక్తలనేత, సర్వలోక నాయకులు మరియు సర్వ సృష్టిరాశులకు గర్వకారణమైన అంతిమ దైవప్రవక్త మహమ్మద్ (స్వల్లల్లాహు అలైహి వసల్లం) గారికి కూడా యేక దైవారాధనా సందేశమే ప్రసాదింపబడింది. అల్లాహ్ పవిత్రఖుర్ఆన్ ద్వారా ఆయన కిలా తెలిపెను (ఓ దైవ ప్రవక్త) ఇలా పలుకుము: ఓ ప్రజలారా! నేను అల్లాహ్ సమక్షం నుండి మీ అందరి కొరకు పంపబడిన ప్రవక్తను, భూమ్యాకాశాల సర్వాధికారం ఆయనకే ఉంది . ఆయన తప్ప వేరే ఆరాధ్యులెవరూ లేరు ఆయనే జీవితం ప్రసాదించును. మరియు ఆయనే మృత్యువునిచ్చును. కావున అల్లాహ్ యందు మరియు ఆయన ప్రవక్త యందు విశ్వాసం

ఉంచండి (అఆరాఫ్:158)

ఏక దైవారాధన అనగా సంకల్ప శుద్ధి, ప్రేమ, వినయం సమ్మతం, ఆశ, భక్తి కలిగి ఉంటే ఒక్క అల్లాహ్‌నే ఆరాధించాలి మరియు ప్రార్థించాలి. అన్ని విధాల ఆరాధనలూ అల్లాహ్ కొరకే అంకితం చేయాలిగానీ, అందువేరే యెవరికీ భాగం ఉంచరాదు.

ఏక దైవారాధన కోసమే అల్లాహ్ సర్వరాశులను సృజించెను, దాని ప్రచారం కోసమే తన ప్రవక్తలను ప్రభవింపజేసెను మరియు తన గ్రంథములను అవతరింపజేసెను. దానివల్లనే విశ్వాసులు మరియు అవిశ్వాసుల మధ్య వ్యత్యాసం తెలియవస్తుంది. ఏకదైవారాధకులు విశ్వాసులుగా పరిగణింపబడి స్వర్గార్హులవుతారు. బహుదైవారాధకులు అవిశ్వాసులుగా పరిగణింపబడి నరకార్హులవుతారు.

ఒకవైపు ఏకదైవారాధన వైపు ఆహ్వానిస్తూ , మరొకవైపు బహుదైవారాధనకు అతిదూరంగా ఉండమని దివ్యఖుర్ఆన్‌లో పలుచోట్ల తెలుపబడింది. అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో పద్దెనిమిదిమంది పరిశుద్ధ ప్రవక్తల పేర్లు ప్రస్తావించి, అంతటి గొప్ప ప్రవక్తలైనా సరే, ఒక వేళ వారు బహుదైవారాధనకు పాల్పడితే వారి సత్కార్యాలన్నీ సర్వదా వృధా చేయబడతాయని హెచ్చరించెను, (అన్అం : 89)

మనం మన జీవిత కాలంలోనే మన సృష్టి రహస్యాన్ని మరియు ఏక దైవారాధనా ఆవశ్యకతను తెలుసుకోవాలి. ఈ తాత్కాలిక ఇహలోక జీవితం తర్వాత శాశ్వత పరలోక జీవితంలో అడుగుపెట్టకతప్పదు. ఏకదైవారాధనా విశ్వాసంపై స్థిరంగా ఉండి పరలోకంలో ప్రవేశించిన వారికి లభించే సుఖాలకు అంతు ఉండదు. బహుదైవారాధన విశ్వాసం కలిగి ఉండి పరలోకంలో

ప్రవేశించిన వారికి దుఃఖపరం పరనుండి విముక్తి లభించదు. దివ్యఖుర్ఆన్‌లోని ఈ హెచ్చరికను గమనించండి: ఎవరైతే అల్లాహ్ సాటి కల్పింతురో, అల్లాహ్ వారి కొరకు స్వర్గప్రవేశాన్ని నిషేధించెను, అంతేగాక నరకమే వారికి స్థిరనివాసంగా ఉంటుంది. (మాయిదా 72)

అరాధనకు అరబీ పదం "ఇబాదత్", ఇబాదత్ అంటే అత్యంత అణకువ మరియు వినయం, ఇస్లామీయ పరిభాషలో ఇబాదత్ అంటే అత్యంత ప్రేమ, వినయం, భక్తి కలిగి అల్లాహ్‌ను ఆరాధించటం. .

ఆరాధన నాలుగు విధాలుగా ఉంటుంది. 1. వైశ్వాసిక ఆరాధన 2. శాబ్దిక ఆరాధన 3. శారీరక ఆరాధన 4. ధన వ్యయ రూప ఆరాధన. కావున అన్ని విధాల ఆరాధనలూ అల్లాహ్‌కొరకే అంకితం చేయటం మనందరి విధి.

ఇక ఆరాధన యొక్క కొన్ని రకాలు తెలుసుకుందాం. పూజ, గౌరవ భావంతో వంగటం, సాష్టాంగ పడటం, ప్రదక్షిణ చేయటం, మొక్కుబడులు మొక్కుకోవటం, జంతువులు బలివ్వటం, శరణువేడటం, నమ్ముకోవటం, మొదలగు ఇవన్నీ ఆరాధన క్రిందికే వస్తాయి. కానీ వీటన్నిటినీ అల్లాహ్ కొరకు అంకితం చేయటమే మనందరి కర్తవ్యం, ఈ విషయాన్నే ఈ క్రింద వివరంగా తెలుసుకుందాం.

### 1. గౌరవ భావంతో వంగటం, సాష్టాంగపడటం:

అల్లాహ్ ఇలా బోధించెను. ఓ విశ్వాసులారా! అల్లాహ్ కొరకు గౌరవభావంతో వంగండి, అల్లాహ్ కొరకే సాష్టాంగం చేయండి, అల్లాహ్‌నే ఆరాధించండి, మరియు సత్కార్యాలు చేయండి. వాటి వల్ల మీరు కృతార్థులు కాగలరు. (హజ్ : 77)

2. నమాజ్, త్యాగము బలిః అల్లాహ్ ఇలా ఆదేశించెను. ఓ ప్రవక్తా! ఈ విధంగా ప్రకటించుము. నానమాజ్ (ప్రార్థన), నాత్యాగము (బలి), నా జీవితము, నా మరణము - అన్నీ అతి నిశ్చయముగా - సర్వలోక పాలక పోషక రక్షకుడైన అల్లాహ్‌కే అంకితం, అతనికెవరూ సాటిలేరు. నాకు ఇదే అదేశమివ్వబడింది. నేను మొట్ట మొదటి ముస్లింను, విధేయుడను (అన్ ఆంః162,163).

దైవప్రవక్త ఇలా హెచ్చరించారు. అల్లాహ్ తప్ప ఇతరులపేర బలిచ్చు వానిని అల్లాహ్ శపించి నాశనం చేయుగాక. (ముస్లిం)

3. మొక్కుబడులు , ప్రదక్షిణాలుః దివ్యఖుర్ఆన్‌లో ఇలా పేర్కొనబడింది. ముస్లింలు అల్లాహ్ పేర చేసిన మొక్కుబడులు పూర్తి చేయాలి, మరియు అల్లాహ్ యొక్క అతి ప్రాచీన గృహమైన కాబాకు ప్రదక్షిణాలు చేయాలి. (హజ్ 29) అనగా అల్లాహ్ తప్ప ఇతరుల పేర మొక్కుబడులు చేయరాదు. పవిత్ర కాబాగృహం తప్ప వేరేయే వస్తువుకూ ప్రదక్షిణ చేయటం; ప్రతిమలకు, సమాధులకు ప్రదక్షిణలు చేయటం నిషేదం, మహాపాపం, అంతేకాక ప్రతిమల పేర, సమాధుల పేర ఆస్తులు వ్రాయటం, ఆ ఆస్తుల ఆదాయం వాటి పేర వ్రాయటంకూడా మహాపాప కార్యమే. ఎవరైనా అల్లాహ్ తప్ప యితరుల పేర యేదైనా మొక్కుకుని వుంటే ఆ మొక్కుబడిని పూర్తి చేయరాదు. అది పాపమని తెలిసిన వెంటనే అల్లాహ్ సమక్షాన క్షమాపణ వేడుకోవాలి. మరియు పవిత్ర పదం " లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్" పఠించి తన విశ్వాసం నిర్ధారణ చేసుకోవాలి. కానీ పాపకార్యమని తెలిసికూడా యెవరైనా ఇతరుల పేర మొక్కుబడులు చేస్తే

అతడు ఇస్లాం ధర్మం నుండి బహిష్కరింపబడిన వాడవుతాడు.

4. ప్రమాణం చేయటం: దైవప్రవక్త ముహమ్మద్ (స్వల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా తెలిపారు: అల్లాహ్ పేర గాక యితరుల పేర ప్రమాణం చేయువారు బహుదైవారాధకులు మరియు దైవ తిరస్కారులు అవుతారు.

5. సహాయం వేడుకోవటం: దివ్యఖుర్ఆన్ బోధనను గమనించండి, ప్రతి ముస్లిం ఈ విధంగా పఠించాలి. ఓ అల్లాహ్ నిన్నే ఆరాధించుచున్నాము మరియు నీ సన్నిధినే సహాయం వేడుకొనుచున్నాము. (సూరయే ఫాతిహ)

6. భయభక్తులు కలిగి ఉండటం: దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా ఆదేశించెను: మీరు వాస్తవ విశ్వాసులైతే నాపట్ల భయభక్తులు కలిగి ఉండండి. (ఆలి ఇమ్రాన్ 175)

7. శరణు వేడుకోవటం: దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఈ విధంగా హెచ్చరించెను. అల్లాహ్‌ను విడిచి లాభనష్టాలు చేకూర్చలేని వాటిని పూజించకు, వాటిని శరణు వేడకు, ఒకవేళ నీవలా చేస్తే నీవు కూడా దుష్టుల్లో (అల్లాహ్‌కు సాటి కల్పించువారిలో) లెక్కింపబడతావు.

( యూనుస్: 106)

అల్లాహ్ తప్ప ఆరాధింపబడే ఇతరములన్నీ స్థిరత్వంలేని ఆ శక్తులని ఈ క్రింది వాక్యం స్పష్టపరుస్తుంది. అల్లాహ్ నీకు కీడు చేయాలనుకుంటే, స్వయంగా అల్లాహ్‌తప్ప వేరే యెవరూ ఆ బాధను నిరోధించలేరు. అల్లాహ్ నీకు మేలు చేయాలనుకుంటే దాన్నెవరూ నివారించలేరు. (యూనుస్ : 107)

అలాగే బహు దైవారాధనను ఖండించే మరొక వాక్యాన్ని గమనించండి. ఎవరైతే అల్లాహ్‌ను విడిచి ప్రళయ దినంవరకు యెంత పూజించినా, పిలిచినా జవాబివ్వలేని వారిని పూజిస్తారో, వారిని మించిన మార్గభ్రష్టులు వేరే యెవరు కాగలరు; మరియు తమకు జరిగిన పూజలగురించి ఆ తప్పుడు ఆరాధ్యులకు యేమీ తెలియదు. అంతేకాక ప్రళయ దినాన అందరూ సమాధులనుండి లేచి అల్లాహ్ సమక్షాన హాజరైనపడు ఆతప్పుడు ఆరాధ్యులు తమ ఆరాధకులకు శత్రువులై, వారి ఆరాధనాపూజలను నిరాకరిస్తారు. (అహ్‌ఖాఫ్ః 5,6)

కావున అల్లాహ్‌కాక యితరులు కూడా లాభనష్టాలు కలుగజేయగలరని విశ్వసించేవాడు బహుదైవారాధకుడవుతాడు, అలాగే మృతులను, తన సమీపంలో లేనివారిని అర్థించేవాడు, భయభక్తులతో, నమ్మకంతో నష్ట నివారణకై, లేదా లాభార్జనకై వారిని ప్రార్థించేవాడు కూడా బహుదైవోపాసకుడవుతాడు. అలాగే యితరుల శరణు సహకారాలు వేడుకునేవాడు, వారి సహాయంతో సంతానం కోరేవాడు కూడా బహుదైవోపాసకుడవుతాడు ఎందుకంటే ఆ సర్వకార్యాలశక్తి అల్లాహ్ ఒక్కనికే ఉంది. సజీవులు నిర్జీవులను వేడుకోవటం అజ్ఞానం అవుతుంది. సమాధుల్లోని మృతులు యేమీ వినలేరని, వారిని పూజించటం చెవిటివాని ముందు శంఖమూదినట్లేనని దివ్యఖుర్‌ఆన్‌లో పలుమార్లు పేర్కొనబడింది. (రూంః 52; ఫాత్విర్ 22, నమల్; 80)

కావున సమాధుల్లోని మృతులను పూజించటం, లేదా రాతిబొమ్మలను, చేత్తో గీసిన చిత్రపటాలను పూజించటం అతి దిగజారిన అజ్ఞానం కాకపోతే మరేమిటి?

## బహు దైవారాధన

అల్లాహ్‌ను ఆరాధించు ప్రత్యేక విషయములలో ఇతరులకు కూడా భాగం కల్పించటం బహు దైవారాధన అనబడుతుంది: ఉదాహరణకు సాష్టాంగం చేయటం, జంతు బలి, మ్రొక్కుబడి, అవన్నీ అల్లాహ్ సమక్షాన కాక , అల్లాహ్‌ను విడిచి ఇతరుల కొరకు చేయటమే బహు దైవారాధన అవుతుంది. దీనిగురించి హెచ్చరిస్తూ అల్లాహ్ ఈ విధంగా తెలిపెను: వాస్తవమేమిటంటే అల్లాహ్ బహుదైవారాధనను (అల్లాహ్ సాటి కల్పించడాన్ని) యేనాడూ క్షమించడు. ఈ పాపం తప్ప వేరేయే పాపాన్నైనా సరే తనయిష్టం వచ్చిన వారిగురించి క్షమించును. ఎవరైతే అల్లాహ్‌కు సాటి కల్పింతురో వారు వాస్తవంగా దుర్మార్గ భయంకర) మార్గ భ్రష్టతలో మునిగియున్నారు. (నిసా 116)

అంతేకాక బహు దైవారాధన అతి పెద్ద దౌర్జన్యకాండ యని కూడా దివ్యఖుర్ఆన్‌లో స్పష్టపర్చబడింది. (లుఖ్మాన్ 13)

సర్వ ప్రవక్తల ఏకీభావ సందేశమేమిటంటే ఒక్క అల్లాహ్‌నే ఆరాధించాలి. ఆయనకు యే విధమైన సాటి కల్పించరాదు. ఆరాధనలన్నీ ఆయనొక్కనికే అంకితం చేయాలి గానీ వేరు యెవరికీ అందు భాగం ఉంచరాదు. (అంబియా :25)

ఈ క్రింది వాక్యాన్ని కూడా చదవండి, అల్లాహ్‌ను విడిచి వేరే యెవర్నైతే మీరు ప్రార్థిస్తారో వారందరూ మీ వంటి దాసులే (మీవంటి మామూలు మానవులు మరియు సృష్టి రాశులు మాత్రమే) మీరు వారిని పూజించి మరియు ప్రార్థించి చూడండి. మీరు చేసేపని నిజమైతే వారు మీ ప్రార్థనల నాలకించి మీకు జవాబివ్వాలి. (అరాఫ్ : 184)

మరొక పవిత్ర వాక్యాన్ని గమనించండి : ఓ ప్రజలారా! మీ వివరణకై ఒక ఉదాహరణ పేర్కొనబడుచున్నది ; శ్రద్ధగా వినండిః అల్లాహ్‌ను విడిచి వేరే యెవరినైతే మీరు ప్రార్థించుచున్నారో (ఆ ఆరాధ్యులు విగ్రహాలైనా సరే, అవతారాలైనా సరే, జిన్నులు సైతానులైనా సరే, వలీలు సజ్జనులైనా సరే) వారందరూ కలిసి ఏకమైనా సరే తమ సంయుక్త శక్తితో కూడా ఒక్క ఈగనైనా సృజించలేరు. ఆ ఈగను సృజించటం అటుంచండి. ఆ ఈగ యేదైనా వస్తువు వారినుండి తీసుకొని యెగిరిపోతే వారు దాన్ని తిరిగి తీసుకోలేరు. (ఎందుకంటే వారంతటి అశక్తులు) ఈ ఆరాధకులు మరియు ఆరాధ్యులు ఇద్దరూ అశక్తులే. బహు దైవారాధకులు అల్లాహ్ పట్ల యెలా గౌరవభావంతో ప్రవర్తించాలో అలా ప్రవర్తించలేదు. నిశ్చయంగా అల్లాహ్ అతి శక్తివంతుడు మహోన్నతుడు. (హజ్ : 73,74)

అగోచరజ్ఞానం మరియు భవిష్యత్ జ్ఞానం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. ఆయన కాక ఇతరులకు ఆ జ్ఞానం ఉందని భావించటం కూడా బహుదైవారాధనయే అవుతుంది. ఈ తప్పుడు భావనను ఖండిస్తూ అల్లాహ్ ఇలా పేర్కొనెను: ఓ ప్రవక్తా ! ఇలా ప్రకటించుము : భూమ్యాకాశాల్లో అల్లాహ్ తప్ప వేరే యెవరికీ అగోచరజ్ఞానం, భవిష్యత్ జ్ఞానం తెలియదు. బహు దైవారాధకులు ఎవరినైతే పూజిస్తున్నారో వారికి స్వయంగా తమ పునరుత్థాన సమయమే తెలియదు.(నమల్ 65)

అత్యంత గొప్ప వ్యక్తులైన దైవ ప్రవక్తలకు కూడా అగోచర జ్ఞానం తెలియదు. ఈ విషయాన్ని అల్లాహ్ ఇలా విశదపర్చెను. ఓ ప్రవక్తా ఇలా ప్రకటించుము : నాకు నాస్వయం లాభనష్టాల అధికారం కూడా లేదు. అల్లాహ్ ప్రసాదించిన మేరకు మాత్రమే నాకు శక్తి కలదు. నాకు అగోచర

జ్ఞానం, భవిష్యత్ జ్ఞానం తెలిసి ఉంటే నేను అసంఖ్యాక శుభాలు పొంది ఉండేవాడిని, మరియు నాకు యే విధమైన బాధా కలిగేది కాదు. నేను హెచ్చరించువాడను మరియు విశ్వాసులకు శుభ సందేశం ఇచ్చువాడను మాత్రమే (అలరాఫ్:188)

ఇక మరొక దురాచారఖండన గురించి తెలుసుకుందాం. బహు దైవారాధకులు అల్లాహ్ఏతరులు మొక్కుబడులకై తమ సొమ్ములనుండి ఒక ప్రత్యేక భాగం వెచ్చించేవారు. మరియు ఆ తప్పుడు ఆరాధ్యులపేర జంతువులు కోసేవారు. ఈ విధంగా వారిపట్ల తమభక్తి గౌరవాదులు వెల్లడించేవారు. అల్లాహ్ పలుమార్లు ఈ దురాచారాన్ని ఖండించి నిందించెను. (అన్ అం 156) (నహల్ 57). కావున అల్లాహ్ తప్ప ఇతరులపేర ఏదైనా జంతువు లేదా వస్తువును పుణ్యార్థం అంకితం చేయటం మహాపాపం. అంతేకాక ఆ జంతువు యొక్క మాంసం తినటం, ఆవస్తువును తినటం నిషేధం మరియు మహాపాపం, దీని గురించియే అల్లాహ్ ఈ విధంగా తెలిపెను. అల్లాహ్ నిశ్చయంగా ఈక్రింది వాటిని మీకొరకు నిషేధించెను. తన్ను తానుగా చచ్చిన జంతువు, ప్రవహించేరక్తం, పందిమాంసం మరియు ఏ జంతువు లేదా వస్తువుపై అల్లాహ్ తప్ప ఇతరుల పేరు స్మరించబడిందో ఆ జంతువు మరియు వస్తువు; ఇవన్నీ నిషేధం కానీ యెవరైనా నిస్సహాయ స్థితిలో, వేరేయేమీ దొరకని సమయాన పైవాటిని మనసులో కోరకుండా మరియు ఆకలికిమించకుండా తింటే అతనికియే పాపమూ కలుగదు. నిశ్చయంగా అల్లాహ్ అతిగొప్ప క్షమించువాడు. అత్యంత దయామయుడు. (బఖరా : 173)

కావున అల్లాహ్ తప్ప ఇతరులపేర ప్రత్యేకించబడిన జంతువు వస్తువు యేదైనా సరే నిషేధం. దాన్ని తినటం మహాపాపం. ఇటువంటి దురాచారం కొందరు నామ మాత్రపు

ముష్లింలలో కూడా కానవస్తుంది. అది వివిధ రూపాల్లో కానవస్తుంది. ఉదాహరణకు : షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ గారి నియాజ్ (గ్యారహ్మీ). సయ్యద్ అహ్మద్ కబీర్ గారి గోవు, షేక్, సద్దూపేరిట మేకపోతు, ఇమాం హుసైన్ గారి పేరిట పానకం, పరమాన్నం, బీబీ ఫాతిమా పేరిట సహ్నక్, షేక్ అబ్దుల్ గారి పేరిట చక్కెర: ఇవన్నీ అల్లాహ్ తప్ప ఇతరుల పేర అంకితం చేయబడినవి కాబట్టి వాటిని తినటం, త్రాగటం నిషేధం మరియు మహాపాపం

సామాన్యంగా బహుదైవారాధన రెండు విధాలుగా కానవస్తుంది.

1. కొందరు వ్యక్తులపేర విగ్రహాలు, ప్రతిమలు తయారుచేసి వాటిని పూజించటం 2. కొందరు వ్యక్తుల పేర యేదైనా ప్రదేశాన్ని వృక్షాన్ని, రాయిని కర్రను మరియు అలములను తాజియాలను నియమించుకుని వాటిని పూజించటం, ఈ రెండు రకాల పనులూ పాపకార్యాలే కాబట్టి ఇస్లాం వాటిని నిషేధించింది.

# విచారణ దిన సిఫారసు వివరాలు

ఈలోకంలో సిఫారసు రెండు విధాలుగా కానవస్తుంది. 1. హెూదా సిఫారసు, అనగా రాజు తన ఆస్థానంలోని హెూదాగల వ్యక్తి మాట విని అతని హెూదాకు గౌరవంగా యేదైనా నేరస్థుడిని క్షమించి విడిచి పెట్టటం, 2. ప్రేమ సిఫారసు: అనగా రాజు తనకు ప్రియమైన వ్యక్తి మాటవిని తనప్రేమకు భంగంకలుగకుండా యెవరైనా నేరస్థుడిని క్షమించి విడిచిపెట్టటం, ఇటువంటి సిఫారసులు ఇహలోకంలో జరుగుతాయి గానీ అల్లాహ్ సమక్షాన ఇలా జరుగుతుందని భావించటం మహాపాపం, కానీ అల్లాహ్ సమక్షాన జరిగే సిఫారసు అనుమతి లేకుండా యెవరూ సిఫారసు చేయబడరు. అల్లాహ్ అనుమతి కాకుండా ఎవరి సిఫారసూ చెల్లనేరదు. అంతిమ దినాన అల్లాహ్ తన ప్రవక్తలకు మరియు సజ్జన దాసులకు సిఫారసు చేయు అనుమతినిచ్చును. వారు త మ ఇష్టప్రకారం తాము కోరిన వారికొరకు సిఫారసు చేసే అధికారం కలిగి ఉండరు. అల్లాహ్ యెవరిసిఫారసు కొరకు అనుమతించునో ఆ అనుమతి మేరకు వారి కొరకు సిఫారసు చేయుదురు. ('త్వాహా : 109)

దివ్యఖుర్ఆన్‌లో దేవుని హెచ్చరికను చూడండి: ఓ ప్రవక్తా! ఇలా ప్రకటించుము. ఓ బహుదైవారాధకులారా ! మీరు అల్లాహ్‌ను విడిచివేరే యెవరినైతే ఆరాధ్యులుగాయెంచుకున్నారో వారిని ప్రార్థించి చూడండి (అనగా మీరెంత ప్రార్థించిమొత్తుకున్నా వ్యర్థమే). ఆ తప్పుడు ఆరాధ్యులకు భూమ్యాకాశాల్లో ఒక్క రేణువంత అధికారం కూడా లేదు. వారికి దేవుని రాజ్యంలో యెటువంటి భాగస్వామ్యమూ లేదు. వారు దేవునికి సహకారులూ కాదు. అంతేకాక అల్లాహ్‌యెవరి కొరకైతే సిఫారసు చేయు అనుమతించునో వారికొరకు తప్ప వేరేయెవరికొరకూ, యెవరి

సిఫారసు చెల్లనేరదు. (సబా॰ 22, 23)

ప్రళయదినాన సిఫారసుపొందడానికి రెండు నిబంధనలు తప్పని సరి : 1. ఒకే ఒక దేవుడైన అల్లాహ్‌ను ఆరాధించటం, 2. దైవప్రవక్త ముహమ్మద్ గారి అడుగుజాడల్లో నడవటం.

ఈ విషయాన్నే దైవప్రవక్తగారు ఇలా వివరించారు: ఎవరైతే సంకల్ప శుద్ధితో పవిత్ర వచనాన్ని లాఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్ర సూలుల్లాహ్ "పఠించునో (అనగా దాన్ని పఠించి, దాని యందు విశ్వాసం ఉంచి, దాని వల్ల ఉత్పన్నమయ్యే ఆదేశాల ప్రకారం యెవరైతే ఆచరించునో) వారికి నాసిఫారసు తప్పక లభించును. (బుఖారీ) కానీ బహు దైవారాధకులకు, కపటులకు సిఫారసుయెన్నటికి లభించజాలదు. (ముస్లిం).

ఓ అల్లాహ్ ! మనందరికీ నీ ప్రవక్త సిఫారసు ప్రసాదించుము ఆమీన్!

## ఇస్లాం విశిష్టతలు

1. ఇస్లాం ధర్మం ప్రతిరంగంలో జ్ఞాన మేధాశక్తులకు అనుగుణంగా పయనిస్తుంది.
2. ఇస్లాం ధర్మం నాగరికతా ప్రగతుల మార్గానికి ఆహ్వానిస్తుంది.
3. ఇస్లాం ధర్మంలోనే ఆధ్యాత్మిక, భౌతిక విషయాలు ఇమిడి ఉన్నాయి.
4. ఇస్లాం ఒక్కటే సత్య ధర్మమని నేటి ఆధునిక ప్రపంచం కూడా సాక్ష్యమిస్తుంది.
5. ఇస్లాం ధర్మం సత్య ధర్మమని పరిశోధనల ద్వారా నిరూపించటం అతి సులభం

6. ఇస్లాం ధర్మం ఒక్కటే సర్వ దైవప్రవక్తల యందు, మరియు సర్వదైవ గ్రంథముల యందు విశ్వాసం ఉంచటం తప్పనిసరిగా పేర్కొంటుంది.

7. ఇస్లాం ధర్మంలో మాత్రమే సర్వమానవాళి యొక్క సర్వ జీవిత సమస్యలకు పరిష్కారం ఉంది.

8. ఇస్లాం ధర్మం సత్య ధర్మమని ఆధునిక శాస్త్రాలు కూడా సాక్ష్యమిస్తున్నాయి.

9. ఇస్లాం ధర్మంలో మాత్రమే సౌలభ్యం మరియు చక్కదనం ఉంది

10. ఇస్లాంధర్మం మాత్రమే ప్రతి ప్రాంతవాసులకు, ప్రతి కాలము వారికి అతి అనుకూలమైనది.

11. ఇస్లాం ధర్మం ప్రకారం ఆచరించటం ప్రతి స్థితిలోనూ అతి సులభం.

12. ఇస్లాం ధర్మం ఒక్కటే అతిమితాలకు అతీతంగా మధ్యస్థంగా ఉంటుంది.

13. ఇస్లాం ధర్మం యొక్క దైవగ్రంథం మాత్రమే (అనగా దివ్య ఖుర్ఆన్) అతి భద్రంగా ఉంది.

14. ఇస్లాంధర్మం యొక్క దివ్యగ్రథం మాత్రమే సర్వమానవాళి మార్గదర్శానికి ప్రకాశం వంటిది.

15. ఇస్లాం ధర్మం మాత్రమే ప్రయోజిక విద్యలనభ్యసించే అనుమతిస్తుంది.

16. ఇస్లాం ధర్మం ఒక్కటే నేటి ఆధునిక ప్రగతివల్ల ప్రయోజనం పొందుతుంది.

17. ఇస్లాం ధర్మంలో మాత్రమే ఆధునిక నాగరికతలోని

పొరపాట్లకు సరియైన దిద్దుబాటు కలదు.

18. ఇస్లాం ధర్మంలో మాత్రమే నాగరికతయొక్క భౌతికతా ఆధ్యాత్మికతలు ఇమిడి ఉన్నాయని చరిత్ర చాటి చెబుతుంది.

19. ఇస్లాం ధర్మం ద్వారానే లోకంలో శాంతి స్థాపన కాగలదు.

20. ఇస్లాం ధర్మ సత్యాన్ని, జ్ఞాన విశ్లేషణ ద్వారా అతిసులభం

21. ఇస్లాంధర్మం మాత్రమే మానవసమాజంలోని వివిధ వ్యత్యాసాలను నిర్మూలించింది.

22. ఇస్లాంధర్మం ఒక్కటే సర్వమానవాళికి ఒకే మానవత్వచట్టం ఉండాలని ప్రకటించింది.

23. ఇస్లాంధర్మం మాత్రమే సాంఘికసమానత్వాన్ని స్థాపించింది.

24. ఇస్లాంధర్మంలో మాత్రమే ప్రకృతికి విరుద్ధమైన యే విషయమూ కానరాదు.

25. ఇస్లాం ధర్మం మాత్రమే రాజ్యపాలకుల దౌర్జన్య నియంతృత్వాలనురూపుమాపి పరస్పర సలహాలవిదానాన్ని రూపొందించింది.

26. ఇస్లాం ధర్మం మాత్రమే శత్రువుల పట్ల కూడా న్యాయంగా వ్యవహరించాలని బోధించింది.

27. ఇస్లాం ధర్మం గురించియే సర్వదైవ గ్రంధముల యందు శుభవార్త కలదు.

28. ఇస్లాం ధర్మం మాత్రమే స్త్రీలహక్కులను కాపాడి వారికి భద్రతారక్షణలు యేర్పరచింది.

29. ఇస్లాం దర్మం మాత్రమే వివిధరంగుల, వివిధజాతుల, వివిధప్రాంతవాసుల మధ్య సమానత్వం నెలకొల్పింది.

30. ఇస్లాం ధర్మం మాత్రమే రాజకీయ విధులు నిర్ణయించింది.

31. ఇస్లాం ధర్మం మాత్రమే ధార్మికవిద్యాభ్యాసంకొరకు

ప్రోత్సహించి, ప్రయోజనకర విజ్ఞానాన్ని దాచిపెట్టడాన్ని నిషేధపర్చింది.

32. ఇస్లాం ధర్మం యొక్క ఆదేశాలు మాత్రమే ఆధునిక వైద్య శాస్త్ర పరిశోధనా ఫలితాలకు అనుగుణంగా ఉన్నాయి.

33. ఇస్లాం ధర్మం మాత్రమే బానిసల పట్ల జరుగుచుండిన పశు ప్రవర్తనను నిషేధించి,వారిని రక్షించి, సమానత్వ స్వాతంత్ర్యాల గురించి అధిపతులను ప్రోత్సహించింది. (దీని ఫలితంగా అనేక మంది బానిసలు రాజ్యాధిపతులై పరిపాలన చేశారు.)

34. ఇస్లాం ధర్మం మాత్రమే బుద్ధి బలం మరియు మేధాశక్తి యొక్క ఔన్నత్యాన్ని మరియు దాని నిర్ణయాత్మక శక్తిని నిరూపించింది.

35. ఇస్లాం ధర్మం మాత్రమే ధనికులు దాన ధర్మాలు చేయాలని ప్రోత్సహించి ఒకవైపుధనికులను, మరొకవైపు పేదవారిని కాపాడింది.

36. ఇస్లాం ధర్మం మాత్రమే ప్రకృతి ధర్మం మరియు దైవప్రసాదిత వివేకం ప్రకారం సద్గుణాల కాఠిన్య లాలిత్యాల స్థానాన్ని ధృవపర్చింది.

37. ఇస్లాం ధర్మం మాత్రమే సర్వ సృష్టి రాశుల పట్ల దయా దాక్షిణ్యాలతో ప్రవర్తించాలని ఆదేశించింది.

38. ఇస్లాం ధర్మ మాత్రమే ప్రకృతినియమాలకు అనుగుణంగా నాగరిక హక్కులు నియమాలు బోధించింది.

39. ఇస్లాం ధర్మం మాత్రమే మానవుల ఆరోగ్యాన్ని మరియు సంపదను కాపాడింది.

40. ఇస్లాం ధర్మం మాత్రమే మానవుని మనసును, మేథస్సు, ప్రవర్తనను ప్రభావిత పర్చి సరిచేసింది.

– సంపూర్ణం –

طبعت بمطابع دار طيبة ـ الرياض السويدي
شارع عبدالملك بن هشام ـ ت : ٤٢٨٣٨٤٠

# محاسن الدين الإسلامي

## بلغة تلغو

تأليف

سيد عبدالحكيم

ترجمه

عبدالباسط عميري

طبع على نفقة إدارة أوقاف
صالح بن عبدالعزيز الراجحي
غفر الله له ولوالديه ولذريته ولجميع المسلمين
www.rajhiawqaf.org